ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

బుధవారం 3 సెప్టెంబరు 2025

అక్షరానికి అపూర్వ విజయం

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వారధిగా ప్రజా సమస్యల పరిష్కారం



వెలుగులు నింపుతా..

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం నిర్వహించిన ఏడు నెలల తరువాత వాటి పురోగతిని తెలియజేసేందుకు 'సక్సెస్ మీట్'ను నిర్వహించడం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చిత్తశుద్ధికి, సామాజిక బాధ్యతకు నిదర్శనం. ప్రజలకు సేవ చేయాలి, ప్రజా సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టి తీసుకువచ్చి పరిష్కార మార్గం చూపాలన్న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఎండీ వేమూరి రాధాకృష్ణ తపన అభినందనీయం. ఈ వినూత్న కార్యక్రమంలో ప్రజల సమస్యలు వేగంగా పరిష్కారమౌతున్నాయి. అన్ని సమస్యలను పరిష్కరించి కొత్తచెరువులో వెలుగులు నింపుతాము. పుట్టపర్తి నియోజకవర్గానికి గ్రేట్ వేలాగా కొత్తచెరువును అభివృద్ధి చేస్తాం'

- పల్లె రఘునాథరెడ్డి, మాజీ మంత్రి



ప్రసంగిస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



అక్షరంతో చైతన్యం

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' పేరిట ప్రజా ప్రతినిధులను, అధికారులను ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఒక వేదికపైకి తీసుకువచ్చింది. ప్రజలు తమ సమస్యలను నేరుగా మాతో చెప్పుకునేలా చొరవ చూపింది. అలా జనవరి 28న ప్రజలు మా దృష్టికి తెచ్చిన సమస్యలలో 99 శాతం పరిష్కరించాము. ఈ పనుల కోసం రూ.5.86 కోట్లు మంజూరు చేయించాము. తొలి ప్రాధాన్యం కింద రూ.4.68 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాము. మిగిలినవాటినీ పరిష్కరిస్తాం. సమస్యలపై పోరాటం ప్రతి ఒక్కరి బాధ్యత. ఈ పోరాటంలో అతి శక్తివంతమైన ఆయుధం అక్షరం. ఆ అక్షరం ద్వారానే ఆలోచన పుడుతంది. తద్వారా చైతన్యం వస్తుంది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కార్యక్రమం ప్రజలను చైతన్యపరిచింది. మాకు వారి సమస్యలు తెలిశాయి. కాబట్టే పరిష్కరించాము. మాకు.. మా ప్రజలకు మధ్య వారధిగా నిలిచినందుకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌కు కృతజ్ఞతలు..'

- పల్లె సింధూరారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే

దశాబ్దాల సమస్య పరిష్కారమైంది..



కొత్తచెరువుకు కొన్ని దశాబ్దాలుగా శ్మశానవాటిక సమస్య ఉంది. ఎవరైనా మృతిచెందితే ఎక్కడ ఖననం చేయాలో తెలియక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. చెరువు, కాలువ, ఆర్అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా మృతదేహాలను పూడుస్తున్నాం. చాలా సంవత్సరాలుగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనవరి 28న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలుసుకుని అక్కడికి వచ్చాను. శ్మశానవాటిక సమస్యను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ఖచ్చితంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మాటిచ్చారు. చెప్పినట్లుగానే చేశారు. శ్మశాన వాటిక కోసం సర్వే నంబరు 1,451లో 3.45 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ కారణంగానే ఈ సమస్య పరిష్కారమైంది. వారికి ధన్యవాదాలు. మా ఎమ్మెల్యే, మాజీ మంత్రికి, అధికారులకు కృతజ్ఞతలు.

- సాలమ్మగారి శివప్రసాద్, కొత్తచెరువు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన వినూత్న కార్యక్రమం 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' అపూర్వ విజయం సాధించింది. కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ ఏడాది జనవరి 28న నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, వివిధ శాఖల అధికారులకు తమ సమస్యలను వివరించారు. కొత్తచెరువు బీసీ కాలనీ సమస్యల పరిష్కారం కోసం కార్యక్రమాన్ని నిర్వహించినా.. నియోజకవర్గ వ్యాప్త సమస్యలను ప్రజలు ప్రస్తావించారు. మైకు అందుకుని 28 మంది నేరుగా తమ సమస్యలను వివరించారు. మాట్లాడలేనివారు వినతిపత్రాలను సమర్పించారు. ఇది జరిగిన ఏడు నెలల తరువాత.. కొత్తచెరువులో ప్రజల సమక్షంలో మంగళవారం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. ఎమ్మెల్యే, మాజీ మంత్రి, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఆ వేదికలో వచ్చిన సమస్యల్లో 99 శాతం పరిష్కారమయ్యాయని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రకటించారు. ఏడు నెలల క్రితం 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..'లో వచ్చిన ఒక్కో సమస్యను ఆమె ప్రస్తావిస్తూ, వాటిని ఎలా పరిష్కరించారో వివరించారు. మిగిలిన ఒక్కశాతం ఏ స్థితిలో ఉన్నాయో చెబుతూ.. వాటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అప్పట్లో ఆవేదనతో వచ్చి సమస్యలు చెప్పుకున్న పలువురు ఆనందంగా తరలి వచ్చి.. 'దశాబ్దాలు వేధించిన సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి. ఎంతమంది అధికారులు, నాయకులను కలిసినా పరిష్కారం కానివి ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వేదికపై పరిష్కారమయ్యాయి..' అని కృతజ్ఞతలు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి, కొత్తచెరువు

జనవరి 28న 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' నిర్వహణ

సమస్యలను చెప్పుకున్న వందలాది మంది కొత్తచెరువు ప్రజలు

ఏడు నెలల తరువాత ప్రజల సమక్షంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సక్సెస్ మీట్



ప్రజలు చెప్పిన అంశాలను శ్రద్ధగా రాసుకుంటూ..

- రూ.5.86 కోట్లతో 99 శాతం సమస్యలను పరిష్కరించాం
- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి
- దశాబ్దాలు వేధించిన సమస్యలు పరిష్కారమయ్యాయి
- కృతజ్ఞతలు తెలిపిన కొత్తచెరువు ప్రజలు

(వివరాలు 6లో, మెయిన్‌లో..)



హాజరైన ప్రజలు

పెద్దాస్పత్రి సూపరింటెండెంట్‌గా

డాక్టర్ సుబ్రహ్మణ్యం

డాక్టర్ మల్లీశ్వరి పేరు ప్రచారం.. చివరి క్షణంలో మార్పు

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయశ్రీ



డాక్టర్ విజయ శ్రీ



డాక్టర్ కేఎల్ సుబ్రహ్మణ్యం

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ కేఎల్ సుబ్రహ్మణ్యం, అనంతపురం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయశ్రీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ కృష్ణబాబు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఆర్థోపెడిక విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ ఆత్మారామ్ జూన్ నెలలో సూపరింటెండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. వివిధ కారణాలరీత్యా తాను ఆ పదవికి సమయం కేటాయించలేకపోతున్నానని ఆయన తరచూ చెబుతున్నారు. దీంతో అనస్థీషియా విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రహ్మణ్యంను నియమించారు. గతంలో ఆయన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేశారు.

చివరి క్షణంలో...

శ్రీకాకుళం, విజయనగరం మెడికల్ కాలేజీలకు ప్రిన్సిపాళ్లను, నెల్లూరు, అనంతపురం వైద్యశాలలకు సూపరింటెండెంట్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నంద్యాల వైద్యశాల సూపరింటెండెంట్ ప్రొఫెసర్ మల్లీశ్వరి నియమితులయ్యారని జోరుగా ప్రచారం సాగింది. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో వార్తలొచ్చాయి. కొందరు ఆమెకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కానీ అనూహ్యంగా పేరు మారిపోయింది.

ఇష్టం లేదా..?

సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టేందుకు డాక్టర్ సుబ్రహ్మణ్యం ఇష్టపడటం లేదని సమాచారం. ఉత్తర్వులు రాగానే ఆయనకు పలువురు శుభాకాంక్షలు చెప్పారు. ఆ సమయంతో తనకు ఇష్టంలేదని, బాధ్యతలు చేపడితేనే కదా? అని అన్నట్లు సమాచారం. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారా లేదా అన్న చర్చ జరుగుతోంది.

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

అనంతపురం క్రైం, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటన ఏర్పాట్లపై ఎమ్మెల్యేలు, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్, పార్టీ పరిశీలకులు సమీక్షించారు. స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో మంగళ వారం అనంతపురం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, టీడీపీ ఉమ్మడి జిల్లా పరిశీలకుడు నాని, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు.. సీఎం టూర్‌పై సమీక్షించారు. సభాస్థలిని సిద్ధం చేయించడంతోపాటు, పార్కింగ్ ఏర్పాట్లు ఇతర కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు, సీఎం కార్యక్రమాల కో-ఆర్డినేటర్, నాయకులు

ముళ్ల పాన్పు

బెళుగుప్ప, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెళుగుప్ప తండాలో మంగళవారం గ్రామదేవత గౌరసముద్రం మారెమ్మ జాతరలో భాగంగా పూజారి చంద్రమోహన్ నాయక్.. ముళ్ల కంపలపై పడుకున్నారు. దీంతో భక్తులు ఆశ్చర్యపోయారు. మారెమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామ శివార్లలో ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన ముళ్లకంపలపై గంతులు వేస్తూ పూజారి పడుకున్నారు. బుధవారం సిడిమాను ఉత్సవంతో జాతర ముగుస్తుందని తండావాసులు తెలిపారు.





ముళ్లకంపలపై పడుకున్న పూజారి, మారెమ్మ ఉత్సవ విగ్రహంతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

బీడు కనిపించకూడదు : కలెక్టర్



అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీడు భూమి కనిపించకుండా ఏదో ఒక పంట సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్, డీఆర్‌డీఏ పీడీ శైలజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... బీడు భూమిలో ఉద్యాన పంటల పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ వంటివి ఏర్పాటు చేయాలన్నారు. బీడు మాత్రం ఉండకూడదన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ... జిల్లాలో 577 గ్రామ పంచాయతీలను కలుపుకుని 210 ఎన్ఎంఎన్ఎఫ్ క్లస్టర్లుగా ఏర్పాటు చేశారన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి ఆసక్తి ఉన్న రైతుల నమోదు, ఎన్ఎఫ్ మోడ్‌లోకి మారడానికి ఇష్టపడే వారి కోసం ఎన్ఎఫ్ ప్రణాళికలను సిద్ధం చేస్తామని వివరించారు.

గురుపూజోత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

- సమన్వయ కమిటీ సమావేశంలో డీఈఓ

అనంతపురం విద్య, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహిద్దామని డీఈఓ ప్రసాద్‌బాబు సూచించారు. వేడుకల నిర్వహణపై స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఉపాధ్యాయ సంఘాలతో మంగళవారం విద్యాశాఖ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించింది. డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. ఈనెల 5వతేదీ జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో వేడుకలు నిర్వహిస్తామన్నారు. విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. 53 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అర్హులకు అవకాశం కల్పిస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఈఓలు మల్లారెడ్డి, శ్రీనివాసరావు, ఏడీలు మునీర్, శ్రీనివాసులు, డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు, సంఘాల నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు, హాజరైన ఉపాధ్యాయ నేతలు

బడిలో చేపలు శుభ్రం చేసిన విద్యార్థులు

- టీచర్ల విందు కోసమే..

కణేకల్లు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బడిలో ఉపాధ్యాయులు విందు ఏర్పాటు చేసుకున్నారు. చేపలు తెప్పించుకున్నారు. చదువుకోవాల్సిన విద్యార్థులతో వాటిని శుభ్రం చేయించారు. మండలంలోని యర్రగుంట ఉన్నత పాఠశాలలో అయ్యావార్ల విందుకు విద్యార్థులు చేపలు శుభ్రం చేస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తరగతి గదిలో ఉండాల్సిన విద్యార్థులు మంగళవారం చేపలు శుభ్రం చేస్తూ కనిపించారు. స్థానికులు ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియలో వైరల్ చేశారు. విద్యార్థులతో చేపలు శుభ్రం చేయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యాహ్న భోజనం వండే వ్యక్తి.. టీచర్లకు పెట్టేందుకు చేపల కూర సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇందులో భాగంగా చేపలను విద్యార్థులతో శుభ్రం చేయించినట్లు సమాచారం. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌ను అడగ్గా.. ఉపాధ్యాయ దినోత్సవం నేపథ్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో పాల్గొనేందుకు తాను కణేకల్లుకు వెళ్లాననీ, చేపలు శుభ్రం చేయించిన విషయం తెలియదన్నారు.



యర్రగుంటలో చేపలు తోముతున్న విద్యార్థులు

నువ్వొస్తానంటే.. నే రానిస్తానా..!

- కొనసాగుతున్న టామ్ అండ్ జెర్రీ గేమ్
- నేడు తాడిపత్రికి వెళ్లనున్న పెద్దారెడ్డి..?
- గోడౌన్ ప్రారంభిస్తున్నాం.. మనోళ్లు వచ్చేయండి
- అనుచరగణానికి జేసీ ప్రభాకర్ రెడ్డి పిలుపు
- దిక్కుతోచని స్థితిలో పోలీసు యంత్రాంగం

తాడిపత్రి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు కేతిరెడ్డి పెద్దారెడ్డి బుధవారం తాడిపత్రికి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సుప్రీం కోర్టు అనుమతి ఉన్నందున ఇక తనకు అడ్డు చెప్పవద్దని ఆయన పోలీసులను కోరినట్లు తెలిసింది. ఈ విషయం తెలిగాయనే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఎప్పటిలాగే తన ఏర్పాట్లు తాను ప్రారంభించారు. మార్కెట్ యార్డులో గోడౌన్‌ను బుధవారం ప్రారంభిస్తున్నామని, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. దీంతో పట్టణంలో మరోమారు టెన్షన్ వాతావరణం నెలకొంది. వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం సందర్భంగా మూడు రోజుల క్రితం పట్టణంలో ఘర్షణ జరిగింది. టీడీపీకి చెందిన జేసీ ప్రభాకర్ రెడ్డి, కాకర్ల రంగనాథ్ వర్గీయులు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇప్పుడు పెద్దారెడ్డి వచ్చేందుకు సిద్ధం కావడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

రావడం.. అడ్డుకోవడం..

పెద్దారెడ్డి తాడిపత్రివైపు వచ్చిన ప్రతిసారీ పోలీసులు అడ్డుకుంటున్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని తిప్పి పంపుతున్నారు. దీంతో ఆయన అనంతపురానికి, లేదా తిమ్మంపల్లికి పరిమితమౌతున్నారు. కోర్టుల అనుమతి తెచ్చుకున్నా తాడిపత్రిలో అడుగు పెట్టడం ఆయనకు సాధ్యం కాలేదు. ఇన్నాళ్లూ 'రానిచ్చేది లేదు..' అని ఖరాకండిగా చెబుతూ వచ్చిన జేసీ ప్రభాకర్ రెడ్డి.. ఇప్పుడు కొత్త పల్లవి అందుకున్నారు. 'నేను కాదు.. ప్రజలు అడ్డుకుంటున్నారు..' అని అంటున్నారు. పెద్దారెడ్డి వస్తానన్న ప్రతిసారీ ఏదో ఒక కార్యక్రమం పేరిట తన అనుచరగణాన్ని తాడిపత్రికి రప్పించుకుంటున్నారు. ఈ వ్యవహారం పోలీసులకు తలనొప్పిగా మారింది.





అప్పుడు మొదలైంది..

2024 ఎన్నికల సమయంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో కేసులు నమోదు చేసిన పోలీసులు రెండు పార్టీల ముఖ్య నాయకులను మూడు నెలలపాటు తాడిపత్రి నుంచి బహిష్కరించారు. కౌంటింగ్ పూర్తి అయిన మూడు నెలల తరువాత జేసీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి తాడిపత్రికి వచ్చారు. కానీ పెద్దారెడ్డి మాత్రం అడుగు పెట్టడం లేదు. పలు మార్లు కోర్టును ఆశ్రయించి, అనుమతి పొందారు. కానీ శాంతిభద్రతల సమస్య పేరిట పోలీసులు అడ్డుకుంటున్నారు. ఇటీవల పోలీసులే వెంట ఉండి తాడిపత్రికి పంపాలని కోర్టు ఆదేశించింది. అదే రోజు అనంతపురం రోడ్డులోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద శివుడి విగ్రహావిష్కరణ పేరిట జేసీ ప్రభాకర్ రెడ్డి తన అనుచరగణాన్ని మోహరించారు. తాజాగా గోడౌన్ ప్రారంభోత్సవం పేరిట అందరినీ తాడిపత్రికి రమ్మన్నారు. గడిచిన 18 నెలలుగా టామ్ అండ్ జెర్రీ గేమ్‌ను తలపించేలా ఇదే తంతు కొనసాగుతోంది.

ప్లీజ్.. రావద్దు..

తాడిపత్రికి రావద్దని పెద్దారెడ్డిని పోలీసులు కోరినట్లు తెలిసింది. పట్టణ సీఐ సాయిప్రసాద్ సెలవులో ఉన్నారు. రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి ఇన్‌చార్జిగా ఉన్నారు. పెద్దారెడ్డి వస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, టౌన్, రూరల్ ప్రాంతాలలో ఇరువర్గాలను కట్టడి చేయడం సాధ్యం కాదని పోలీసులు ఆందోళన చెందుతున్నారు. రూరల్ సీఐకి రెండు బాధ్యతలు ఇబ్బందికరంగా ఉన్నాయని, ఇతరులకు పట్టణ బాధ్యతలు అప్పగించాలన్న ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలిసింది. అంతవరకూ తాడిపత్రికి రావద్దని పెద్దారెడ్డిని పోలీసుల కోరినట్లు తెలిసింది. దీనికి ఆయన ఒప్పుకోలేదని సమాచారం. తనకు సుప్రీం కోర్టు అనుమతి ఉందని, ప్రతిసారీ అడ్డుకోవడం సరికాదని అన్నట్లు సమాచారం. 'మీరు ఎప్పుడు వెళ్లమంటే అప్పుడే వెళతా. కానీ మీరు ప్రతిసారీ అడ్డుకుంటున్నారు. ఫలానా రోజు అనుమతిస్తామని లిఖితపూర్వకంగా ఇవ్వండి. అప్పుడే మీ మాటలు నమ్ముతా..' అని పెద్దారెడ్డి అన్నట్లు తెలిసింది. దీంతో వారు వెనుదిరిగినట్లు సమాచారం. సుప్రీం కోర్టు అనుమతి ఉన్నందున.. ఈసారైనా పెద్దారెడ్డి ఎంట్రీ సాధ్యమౌతుందా అన్న చర్చ జరుగుతోంది.

డీఎస్సీ నకిలీలపై కలెక్టర్ సీరియస్

6

- ఫిర్యాదులపై రీ వెరిఫికేషన్‌కు ఆదేశాలు
- సంబంధిత శాఖల అధికారులతో విద్యాశాఖ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

7

అప్పులకు మరో అన్నదాత బలి

అక్షరానికి అపూర్వ విజయం



మరిన్ని విన్నపాలు వినవలె..



'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' సక్సెస్ మీట్‌లోనూ సమస్యలపై ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డికి అర్జీలు ఇస్తున్న కొత్తచెరువు ప్రజలు

కొత్తచెరువు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' చక్కటి ఫలితాలను ఇచ్చిందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కొనియాడారు. కొత్తచెరువు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం జరిగిన సక్సెస్ మీట్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. కొత్తచెరువులో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమాన్ని ఈ ఏడాది జనవరి 28న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించింది. సామాన్య ప్రజలు, రైతులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. తమ ప్రాంత సమస్యలను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, వివిధ శాఖల అధికారులు హాజరై.. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. శ్మశాన వాటిక, ఇండోర్ స్టేడియం, రైల్వే అండర్ బ్రిడ్జి, సీసీ రహదారులు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, ట్రాఫిక్ తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తెచ్చారు. ఆ సమస్యల్లో 99 శాతం పరిష్కరించామని ఎమ్మెల్యే అన్నారు. కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆగిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని రూ.2 కోట్లతో పూర్తి చేస్తామని తెలిపారు. పెనుకొండ రహదారిలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న రూ.2 కోట్లు మంజూరు చేశారని, పనులు జరుగుతున్నాయని తెలిపారు. కొత్తచెరువు శ్మశాన వాటికకు 3.70 ఎకరాల స్థలాన్ని కేటాయించామని అన్నారు. పట్టణ వాసులకు 1,150 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయించామని తెలిపారు. 182 మందికి ఇంటి స్థలాల పొజిషన్ సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. కొత్తచెరువులో 120 ఆక్రమణలు తొలగించి, అభివృద్ధికి బాటలు వేస్తున్నామని అన్నారు.

పరిశ్రమలకు భూములిస్తాం..

నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తే ఏపీ ఐఐసీ ద్వారా భూములు కేటాయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. బండ్లపల్లి, కదిరేపల్లి సమీపంలో ఇండస్ట్రియల్ హబ్ కోసం 1,376.22 ఎకరాల భూమిని సేకరించామని అన్నారు. సౌర విద్యుత్ ప్లాంట్ నిర్మాణం కోసం ఏపీ ఎస్పీడీసీఎల్‌కు 12 ఎకరాల భూమిని కేటాయించామని తెలిపారు.

వేగంగా పరిష్కారం: పల్లె

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వినూత్న కార్యక్రమంలో ప్రజల సమస్యలు వేగంగా పరిష్కారమౌతున్నాయని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. కొత్తచెరువుకు త్వరలో వెలుగు.. వెలుతురు వస్తుందని అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గానికి గ్రేట్ వేలాగా కొత్తచెరువును అభివృద్ధి చేస్తామని అన్నారు. మౌళిక సదుపాలైన తాగునీరు, విద్యుత్, పక్కా గృహాలు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఆక్రమణలు లేని రహదారుల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. జిల్లాకు కొత్తచెరువు కేంద్ర బిందువు అని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 'గేట్ వే ఆఫ్ పుట్టపర్తి'గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. సీఎం చంద్రబాబు అభివృద్ధికి చిహ్నమని, ఆయన కృషితోనే ఖజానా ఖాళీగా ఉన్నా సూపర్ సిక్స్ హామీలు అమలవుతున్నాయని అన్నారు. ప్రతి మహిళకు త్వరలో రూ.1500 నిరుద్యోగ భృతి అందుతుందని అన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు కొత్తచెరువులో పేదలకు వెయ్యికి పైగా ఇంటి పట్టాలు ఇచ్చానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నటరాజ్, ఇన్‌చార్జి తహసీల్దారు బాలాంజనేయులు, విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్ నాయక్, పీఆర్ జేఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఓబులేసు, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, టీడీపీ మండల, టౌన్ కన్వీనర్లు రామకృష్ణ, ఒలిపి శ్రీనివాసులు, నాయకులు కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, హరిప్రసాద్, బండ్లపల్లి రాజు, ముద్ద రవీంద్ర, నల్లమాడ శంకర, పీఎస్ వెంగప్ప, షర్ఫుద్దీన్, శ్రీనివాస చౌదరి తదితరులు పాల్గొన్నారు.

● ఏళ్ల సమస్య.. నెలల్లో పరిష్కారం



కొత్తచెరువు-పెనుకొండ రహదారిలో పదేళ్ల క్రితం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించడంతో దాదాపు 200 మంది రైతుల పొలాలకు దారి లేకుండా పోయింది. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. సమస్యను వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లాం. వారు బ్రిడ్జిని పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని చెప్పి.. తర్వాత విస్మరించారు. 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో సమస్యను ఎమ్మెల్యే, మాజీ మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. వారు తక్షణమే కేంద్ర రైల్వేశాఖ మంత్రి సోమన్నకు విన్నవించారు. దీంతో ఆయన రూ.2కోట్లు నిధులు మంజూరు చేశారు. వాటితో రైల్వే ట్రాక్ పక్కనే రోడ్డు పనులు చేపడుతున్నారు. నెలాఖరుకు పూర్తయితే పొలాలకు రోడ్డు సమస్య తీరుతుంది. ఏళ్లుగా ఉన్న సమస్య.. నెలల్లో పరిష్కారమవుతుండడం ఆనందంగా ఉంది.

-నాగేంద్రప్రసాద్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

● వెంటనే చర్యలు



'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో కొత్తచెరువులోని వేణుగోపాల్‌నగర్ వాసులు సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటుచేయాలని విన్నవించారు. వెంటనే రూ.30లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలో సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నాం.

-కుళ్లాయప్ప, వేణుగోపాల్‌నగర్

తొలగనున్న చీకట్లు



మండల కేంద్రంలోని ఎల్1, ఎల్2, ఎల్ 3 కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, లైన్లులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పిల్లలను ట్యూషన్ నుంచి పిలుచుకు రావడానికి రాత్రి సమయాల్లో బ్యాటరీలు తీసుకుని వెళ్లాల్సి వస్తోంది. సమస్యను పరిష్కరించాలని 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రికి విన్నవించా. వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టారు. విద్యుత్‌శాఖ అధికారులు స్తంభాలు సరఫరా చేశారు. వాటిని వెంటనే ఏర్పాటుచేసి, లైన్లు లాగితే అంధకారం తొలగిపోనుంది.

-షాహీదా, బీసీకాలనీ, కొత్తచెరువు

రోడ్డు సమస్య పరిష్కారమవుతుండడం ఆనందంగా ఉంది



'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో వంగంపల్లి బ్రిడ్జి వద్ద నుంచి గ్రామంలోకి సీసీ రోడ్డు వేయాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి దృష్టికి తెచ్చా. ఆ మేరకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు 300 మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.30లక్షలతో అంచనాలు వేసి, ప్రతిపాదనలు పంపారు. సమస్య పరిష్కారమవుతుండడం ఆనందంగా ఉంది.

-జయరాం, మాజీ ఎంపీటీసీ, ఇరగంపల్లి

విద్యార్థులు, క్రీడాకారుల కల నెరవేరనుంది

కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి 2017లో టీడీపీ ప్రభుత్వం నిధులు కేటాయించి, పనులను ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఇండోర్ స్టేడియం నిధులు ఇతర పనులకు మళ్లించారు. దీంతో క్రీడాకారులు, విద్యార్థులు ఆటలకు దూరమయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. జనవరి 28న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో ఈ సమస్యను ఎమ్మెల్యే, మాజీ మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జూలై 10న జరిగిన మెగా పీటీఎంలో ఇండోర్ నిర్మాణం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడారు. పనుల పునఃప్రారంభానికి రూ.2 కోట్లు ఇస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఇది ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ కారణంగానే సాధ్యమైంది. సంస్థ యాజమాన్యానికి, ఎమ్మెల్యే, మాజీ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు.



- ఎ.వెంగన్న, విశ్రాంత హెచ్‌ఎం, కొత్తచెరువు

దాహం తీర్చారు నాయనా..: నాగలక్ష్మి, విజయనగర్ కాలనీ



కొత్తచెరువు విజయనగర్ కాలనీలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడేవాళ్లం. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లా. స్పందించిన గ్రామ పంచాయతీ అధికారులు రూ.60వేలవ్యయంతో తాగునీటి ట్యాంకును ఏర్పాటుచేశారు. దీంతో కాలనీలో తాగునీటి సమస్య తీరింది నాయనా.. ఎమ్మెల్యే, మాజీ మంత్రి, ఏబీఎన్-ఆంధ్రజ్యోతికి ప్రత్యేక నమస్కారాలు.

ఓల్టేజీ సమస్య తీర్చాలి



జిల్లా కేంద్రం పుట్టపర్తికి కొత్తచెరువు కూతవేటు దూరంలో ఉంది. దీంతో పలు ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి, స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. కాలనీలో లో ఓల్టేజీ సమస్య తలెత్తింది. దీంతో టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, లైట్లు కాలిపోతున్నాయి. సమస్యపై విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా కూడా చేశాం. అయినా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

-అనిల్‌కుమార్, బీసీ కాలనీ, కొత్తచెరువు

● హైటెన్షన్ విద్యుత్‌లైన్ మార్పునకు చర్యలు



కొత్తచెరువు బీసీ కాలనీలోని ఇళ్లు, బీసీ బాలికల వసతిగృహంపై 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ వెళ్తోంది. దీంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో సమస్యను విన్నవించా. వెంటనే ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టారు. లైన్ మార్చడానికి రూ.8లక్షలు ఖర్చు అవుతుందని అంచనాలు సిద్ధం చేశారు. అంత డబ్బు ప్రజలు చెల్లించలేరు. ప్రభుత్వ పరంగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి చర్యలు చేపట్టాలి.

-ఒలిపి శీనా, కొత్తచెరువు

నిధులు తెచ్చారు.. పనులను ప్రారంభించాలి..



మండల కేంద్రంలోని మస్తాన్‌వలీ దర్గా వీధిలో డ్రైనేజీ కాలువ లేక చుట్టుపక్కల ఇళ్ల వారు మురుగు నీటిని రోడ్డుపై వదులుతున్నారు. ఈ నీటిలో మసీదు, చర్చికి వెళ్లాల్సి ఉంది. సమస్యను 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో విన్నవించా. ఆ మేరకు ఎమ్మెల్యే దర్గావీధిని సందర్శించి, రూ.10లక్షల నిధులు మంజూరు చేయించారు. పైపులు కూడా తోలారు. వెంటనే మొదలెట్టాలి. అవసరమైతే జమాతి కింద రూ.4లక్షలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం.

- మాణిక్యంబాబా, మాజీ సర్పంచ్, కొత్తచెరువు

డీఎస్సీ నకిలీలపై
కలెక్టర్ సీరియస్

● ఫిర్యాదులపై రీ వెరిఫికేషన్‌కు ఆదేశాలు
● సంబంధిత శాఖల అధికారులతో విద్యాశాఖ ఆరా



ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో ఆరాతీస్తున్న విద్యాశాఖ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం విద్య, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాలకు సంబంధించి కొందరు అభ్యర్థులు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారనే అంశంపై కలెక్టర్ వినోద్‌కుమార్ సీరియస్‌గా పరిగణించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'డీఎస్సీలో నకిలీల కలకలం..!' కథనంపై ఆయన స్పందించారు. డీఎస్సీలో ఉద్యోగాలు పొందేందుకు కొందరు అభ్యర్థులు బోగస్ సర్టిఫికెట్లు సమర్పించారని ఫిర్యాదులు వచ్చాయి. జాబితాలో లేని అభ్యర్థులు కొందరు బోగస్ సర్టిఫికెట్ల వ్యవహారాలను వెలుగులోకి తీసుకొస్తున్నారు. ప్రధానంగా ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్ సెక్షన్) కింద నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారులతో సర్టిఫికెట్లు జారీ చేయించుకొని ఉద్యోగాలు పొందుతున్నారని ఫిర్యాదులు వచ్చాయి. కొందరు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కింద ప్రభుత్వ శాఖలలో పనిచేస్తూ.. అదే కాలంలోనే బీఈడీ చేసినట్లు సర్టిఫికెట్లు సమర్పించారని, ఇది చట్ట విరుద్ధమని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇలా ఈడబ్ల్యూఎస్ కింద ఆరుగురు, ఉద్యోగాలు చేస్తూ ముగ్గురు బీఈడీ చేసినట్లు సర్టిఫికెట్లు పెట్టారని ఫిర్యాదులు అందాయి. విద్యాశాఖతో పాటు కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి ఫిర్యాదులు వెళ్లాయి. నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారాలపై కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. డీఈఓ ప్రసాద్‌బాబుతో ఫోన్‌లో మాట్లాడుతూ.. 'ఈ నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం ఏంటీ.. ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి.. వెరిఫికేషన్‌లో చూడలేదా.. ఇంతకీ ఏమి జరుగుతోంది' అని సీరియస్‌గానే ప్రశ్నించినట్లు తెలిసింది. ఇందుకు డీఈఓ స్పందిస్తూ.. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు తహసీల్దార్లు జారీ చేశారని, వాటిని వాళ్లే చూడాలని చెప్పారు. ఫిర్యాదుల ఆధారంగా వాటన్నింటినీ రీ వెరిఫికేషన్ చేయించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఏడీ మునీర్, డీఎస్సీ సెక్షన్ సూపరింటెండెంట్ ఆదినారాయణ ఇతర సిబ్బంది ఫిర్యాదులు వచ్చిన అభ్యర్థులపై రీవెరిఫికేషన్‌కు చర్యలు చేపట్టారు. మంగళవారం జిల్లా కార్యాలయం నుంచి ఆయా అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్లపై ఆయా శాఖల అధికారులతో వివరాలు ఆరా తీశారు. వాటిపై మళ్లీ విచారించి తగిన సమాచారం ఇవ్వాలని తెలిపారు. కేజీబీవీలలో ఉద్యోగం చేస్తూ ముగ్గురు మహిళా అభ్యర్థులు బీఈడీ చేసినట్లు సర్టిఫికెట్లు సమర్పించారని ఫిర్యాదులు రావడంతో ఎస్ఎస్ఏ, కేజీబీవీల ఎస్‌ఓలతో వివరాలు ఆరాతీశారు.

పౌరుషానికి ప్రతీక హరికృష్ణ

● సంచలనాలకు మారుపేరు పవన్ కల్యాణ్ ● ఎమ్మెల్యే దగ్గుపాటి
● కేక్ కట్ చేసి సంబరాలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యేలు దగ్గుపాటి, అమిలినేని, నాయకులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజకీయాలు, నిజ జీవితంలో పౌరుషానికి మారుపేరుగా బతికిన నాయకుడు నందమూరి హరికృష్ణ అని, సినిమాలు, రాజకీయాల్లో సంచలనాలకు మారుపేరుగా పవన్ కల్యాణ్ నిలిచారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మాజీ మంత్రి, నందమూరి హరికృష్ణ జయంతి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ముఖ్యమంత్రి కార్యక్రమాల కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ, ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీ పరిశీలకుడు కోవెలమూడి నాని, టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకటరాముడుతో కలసి హరికృష్ణకు ఘనంగా నివాళి అర్పించారు. తర్వాత కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ... నందమూరి హరికృష్ణ ఎన్టీఆర్‌కు చైతన్య రథసారధిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, సినీ నటుడిగా, నిర్మాతగా రాణించారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సినిమాల్లోకి వచ్చి ఉన్నత స్థానానికి ఎదిగారన్నారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, కొండన్న, నాయకులు సుధాకర్ యాదవ్, ఫిరోజ్ అహ్మద్, సంగా తేజస్విని, ఈటె స్వామిదాస్, చేపల హరి, దళవాయి వెంకట నారాయణ, నెట్టెం బాలకృష్ణ, ఓంకార్‌రెడ్డి, మల్లికార్జున, ముస్తాక్, నాగభూషణ, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

సేవా కార్యక్రమాలు చేపట్టిన పార్టీ జిల్లా అధ్యక్షుడు వరుణ్



కేక్ కట్ చేస్తున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ తదితరులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గర్భిణీలు, బాలింతలకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక చెన్నకేశవస్వామి గుడి వద్ద డొక్కా సీతమ్మ పేరిట అన్న వితరణ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ.. తమకు అన్ని విధాలుగా స్ఫూర్తి ప్రదాత పవన్‌కల్యాణ్ అన్నారు. ఆయన మార్గంలో ప్రతి కార్యకర్త నడుచుకొని పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమాల్లో జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, నాయకులు బాబురావు, దివాకర్, కాయగూరల లక్ష్మీపతి, సంజీవరాయుడు, కిరణ్‌కుమార్, ధనంజయ్, సిద్ధు, జయమ్మ, విజయ్‌కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

నేడు సాహితీ సదస్సు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర భారతి తెలుగుశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల వాణిజ్యశాఖ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు సాహితీ సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు సీనియర్ సాహితీవేత్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా తాను రచించిన సిగ్నేచర్ ట్యూన్, విద్వాన్ విశ్వం, సాహితీ స్పర్శ, పప్పూరు రామాచార్యులు, సాహితీ వీక్షణం, సైన్స్-సమాజం-సాహిత్యం, అత్యున్నత కళారూపం సైన్సు జనమాధ్యమాల్లో తెలుగు, మరపురాని మహనీయులు పుస్తకాలపై ప్రముఖ సాహితీవేత్తలు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు విరివిగా హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో ప్రతిభ



ట్రోఫీతో రోషిరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు ప్రతిభ చాటాడు. ఇటీవల తమిళనాడులోని కోయంబత్తూర్‌లో నిర్వహించిన 4వ జాతీయ పారా త్రోబాల్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో ఆంధ్రా పారా త్రోబాల్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకారుడు రోషిరెడ్డి సత్తా చాటాడు. జార్ఖండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రెండు సెట్లతో జట్టును గెలిపించిన రోషిరెడ్డి ట్రోఫీ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. పారా స్పోర్ట్స్ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, రామస్వామి రోషిరెడ్డికి అభినందనలు తెలిపారు.

బైబై గణేశా..!

● ఘనంగా వినాయక నిమజ్జనం
● అర్ధరాత్రి వరకు కొనసాగిన శోభాయాత్ర
● కదిరిలో వెల్లివిరిసిన మతసామరస్యం



వినాయక విగ్రహ వాహనాన్ని లాగుతున్న ఎమ్మెల్యే కందికుంట తదితరులు



నిమజ్జనానికి తరలివెళుతున్న సింహకోట వినాయడు

కదిరి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వినాయకుడి శోభాయాత్రను కదిరి పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏడు రోజుల పాటు పూజలు అందుకున్న వినాయకుడు నిమజ్జనానికి తరలి వెళ్లాడు. భక్తులు బైబై గణేశా అంటూ వీడ్కోలు పలికారు. వర్షం కురుస్తున్నా యువతీ, యువకుల నృత్యాలు, మహిళల పూజలు, భక్తులు కోలాటాలతో పట్టణమంతా శోభాయమానంగా కనిపించింది. వీధులన్నీ ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. పట్టణంలోని వినాయక విగ్రహాలను మధ్యాహ్నం నుంచి రైల్వేస్టేషన్ వద్దకు తరలించారు. ముందుగా లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి, ఇతర పుర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం అక్కడి నుంచి వినాయక విగ్రహాల్ని స్థానిక రైల్వేస్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. మరోసారి అర్చకులు తొలి పూజలు చేసి వినాయక నిమజ్జన యాత్రను ప్రారంభించారు. పట్టణంలోని పెద్ద విగ్రహాలైన బాలికల పాఠశాల వద్ద ఎర్రకోట వినాయకుడు, గొల్లమ్మ మండపం వద్ద ఉన్న సింహకోట వినాయకుడు, శివాలయం వద్ద ఉన్న వినాయకుడు, రైల్వే స్టేషన్ వద్ద రైల్వే గణేశ్‌ను నిమజ్జనానికి తరలించారు. వాటి వెంట వేలాది మంది భక్తులు పాటలు, డీజే డాన్సులతో పట్టణం హోరెత్తిపోయింది. విగ్రహాలన్నీ రైల్వే స్టేషన్ నుంచి పూలే సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, ఎన్‌టీఆర్ సర్కిల్, టవర్‌క్లాక్ మీదుగా నరసింహస్వామిని దర్శించుకొని శివాలయం మీదుగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వెనుక ఉన్న చెరువులో నిమజ్జనానికి వెళ్లాయి. ఈ సందర్భంగా కదిరిలో మతసామరస్యం వెల్లివిరిసింది. ముస్లింలు రైల్వేస్టేషన్ వద్దకు వచ్చి స్వామి పూజల్లో పాల్గొన్నారు. వినాయకుడి విగ్రహం ఉన్న వాహనాన్ని లాగారు. పలుచోట్ల అన్నదానం, నీళ్ల బాటిళ్లు అందించారు. దాదాపు అర్ధరాత్రి వరకు శోభాయాత్ర కొనసాగుతూనే ఉంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ వి. రత్న బందోబస్తును పర్యవేక్షించారు. బందోబస్తులో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



నిమజ్జన చెరువును పరిశీలిస్తున్న ఎస్పీ



నిమజ్జనానికి వెళుతున్న శివాలయం వినాయకుడు

అప్పులకు మరో అన్నదాత బలి


భీమన్న (ఫైల్)

తనకల్లు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పులకు జిల్లాలో మరో అన్నదాత బలయ్యాడు. అప్పుల బాధ భరించలేక మండలంలోని ముళ్లవాండ్లపల్లికి చెందిన రైతు భీమన్న(50) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమన్న తనకున్న రెండెకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటుండేవాడు. అందులో నాలుగు బోర్లు వేశాడు. బోర్లు, మోటార్లు, పైపులు, విద్యుత్ సర్వీసుల కోసం రూ.4 లక్షలు ఖర్చు చేశారు. తన ఇద్దరు కుమారుల్లో ఒకరు ఎంటెక్, మరొకరు బీటెక్ చేస్తున్నారు. వీరి చదువుల కోసం రూ.7 లక్షలు అప్పు చేశాడు. వ్యవసాయ బోర్ల కింద టమోటా, బెండ, వంగ, అనప లాంటి పంటలు సాగుచేసి గిట్టుబాటు ధర లేక నష్టపోయాడు. అలా మరో రూ.7లక్షలు అప్పులపాలయ్యాడు. మొత్తం రూ.18లక్షల అప్పు ఉంది. అందుకు వడ్డీలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. పిల్లల చదువులు కూడా పూర్తికాలేదు. దీంతో మనస్తాపం చెందిన భీమన్న సోమవారం మధ్యాహ్నం పొలం వద్దకెళ్లాడు. అక్కడి నుంచి ద్విచక్రవాహనంలో మండ్లిపల్లి వద్ద ఉన్న బండమీదకు వెళ్లాడు. పురుగుల మందు తాగి మృతిచెందాడు. సోమవారం రాత్రి అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు... తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికారు. మండ్లిపల్లి వద్ద మృతదేహాన్ని చూసిన స్థానికులు.. కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు అక్కడికెళ్లి బోరున విలపించారు. రైతు భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కదిరికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి


లక్ష్మమ్మ (ఫైల్)

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంట్లవారిపల్లికి చెందిన పల్లె సింధూరారెడ్డి పీఆర్వో ఎద్దుల సంతోష్‌రెడ్డి అమ్మమ్మ, శతాధిక వృద్ధురాలు చిన్న కుర్లి లక్ష్మమ్మ (106) మంగళవారం మృతిచెందారు. వందేళ్లు పైబడినా లక్ష్మమ్మ ఆరోగ్యంగా ఉండేవారని కుటుంబీకులు తెలిపారు. మంగళవారం ఉన్నఫలంగా మరణించారన్నారు. లక్ష్మమ్మకు ముగ్గురు చొప్పున కుమారులు, కుమార్తెలు సంతానం. 17 మంది మనవలు, మనవరాళ్లతోపాటు మునిమనవలు, మనిమనవరాళ్లు కూడా ఉన్నారు.

రాళ్ల మధ్యలో పడిపోయి రైతు మృతి


సుబ్రహ్మణ్యం (ఫైల్)

బుక్కపట్నం, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి):మండలంలోని గూనిపల్లికి చెందిన రైతు గుంజే సుబ్రహ్మణ్యం(34) మంగళవారం ప్రమాదవశాత్తు రాళ్ల మధ్యలో పడిపోయి మృతిచెందాడు. ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుబ్రహ్మణ్యానికి మండలంలోని రాశింపల్లి వద్ద పొలం ఉంది. మంగళవారం పొలానికి దారి చేయడానికి వెళ్లాడు. పొలం వద్ద రాళ్లగుట్టపై కూర్చుని ఉండగా ప్రమాదవశాత్తు కాలుజారి రెండురాళ్ల మధ్యలో పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఎవరూ గమనించకపోవడంతో మృతిచెందాడు. కాసేపటి తరువాత అటుగా వెళ్లిన వారు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని, బోరున విలపించారు. సుబ్రహ్మణ్యానికి భార్య ఉష, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల ఆటో బోల్తా

ఐదుగురికి గాయాలు


గాయపడిన విద్యార్థులు

ధర్మవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తారకరామాపురం సమీపాన మంగళవారం సాయంత్రం విద్యార్థుల ఆటో బోల్తాపడింది. అందులోని ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గూడ్‌షెడ్ కొట్టాలలో ఉన్న బాయ్స్ టౌన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సాయంత్రం ఆటోలో ఇంటికి బయల్దేరారు. తారకరామాపురం వద్దగల మలుపులో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు శ్రీచైతన్య, హర్షవర్ధన్, కార్తీక్, జయశ్రీ, దివ్యశ్రీ గాయపడ్డారు. వారిని స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డ్రైవర్ మద్యం మత్తులో ఆటో నడపడమే ప్రమాదానికి కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు, పట్టణాధ్యక్షుడు జింకా చంద్ర.. విద్యార్థులను పరామర్శించారు.

కిందిస్థాయి సిబ్బందితోనే సమస్యలు : డీపీఓ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కిందిస్థాయి సిబ్బంది తప్పిదాలతోనే కార్యాలయంలో కొన్ని సమస్యలు తలెత్తాయని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజనాయుడు పేర్కొన్నారు. డీపీఓ కార్యాలయంలో చోటు చేసుకున్న పలు సమస్యలపై మంగళవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడారు. ఉద్యోగోన్నతులకు సంబంధించి సిబ్బంది అభిప్రాయం మేరకు వినతి పత్రాలు ఇచ్చిన వారి సీనియార్టీ జాబితా తయారు చేయించామని తెలిపారు. ఈ మేరకు ఉద్యోగోన్నతులకు శ్రీకారం చుట్టామని అన్నారు. కిందిస్థాయి సిబ్బంది రోస్టర్‌కు అనుగుణంగా తప్పులు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. వారు తయారు చేసిన నివేదికలను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లగా.. ఆయన తప్పులను గుర్తించి సరిదిద్దాలని ఆదేశించారని అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మరోసారి జాబితా తయారు చేసి అందుకు అనుగుణంగా ఉద్యోగోన్నతులు ఇచ్చామని వివరించారు. ఇక్కడ మరొకరికి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని, గతంలో జరిగిన తప్పులతోనే ఇలాంటి పరిస్థితులు వచ్చాయని అన్నారు. వాటిని సరిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యాలయంలో ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి ఎలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఉద్యోగోన్నతులు, బదిలీల వ్యవహారంలో కార్యాలయంలో వసూళ్లకు పాల్పడుతున్నారన్నది తన దృష్టికి రాలేదని వివరించారు. అలా ఏమైనా జరిగినట్లు తన దృష్టికి వస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అప్పు చెల్లించలేదని దాడి

● పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించలేదని ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన మండలంలోని కనుముక్కల గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కనుముక్కల గ్రామానికి చెందిన గంగినేపల్లి ఆంజనేయులు అదే గ్రామానికి చెందిన ఓబుళరెడ్డి అనే వ్యక్తితో గత కొంతకాలం క్రితం రూ.33వేలు అప్పుగా తీసుకున్నాడు. ప్రతి నెలా అప్పునకు వడ్డీ చెల్లించేవాడు. ఈ క్రమంలో ఆంజనేయులు గ్రామ సమీపంలో గొర్రెలను మేపుకుంటూ ఉన్నాడు. ఓబుళరెడ్డి ఆయన వద్దకు వెళ్లి ఏం రా డబ్బులు ఎప్పుడు చెల్లిస్తావ్ అంటూ వాగ్వాదానికి దిగాడు. తన పరిస్థితి బాగాలేదని, ఇప్పుడే ఇచ్చుకోలేనని చెప్పడంతో ఒక్కసారిగా ఆగ్రహం చెందిన ఓబుళరెడ్డి నానా దుర్భాషలాడి కాళ్లతో తన్నికిందకు పడేశాడు. అంతటితో ఆగకుండా అక్కడే ఉన్న రాతి గుండు తీసుకుని ఆంజనేయులు కాలిపై దాడిచేశాడు. ఆంజనేయులుకు తీవ్రగాయాలు కావడంతో సీకేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం తనపై జరిగిన దాడి గురించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఓబుళరెడ్డిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. కాగా బాధితుడు ఆంజనేయులు స్థానికంగా టీడీపీ కార్యకర్త అని, వైసీపీ వర్గీయుడు అయిన ఓబుళరెడ్డి దౌర్జన్యంతో దాడిచేశాడని స్థానిక టీడీపీ నాయకులు ఆరోపించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పుట్లూరు గ్రామానికి చెందిన గొర్రెల కాపరికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మంగళవారం సీఎం ఆర్థిక సాయం చెక్కు అందించారు. గొర్రెల కాపరి తలారి శ్రీనివాసులుకు చెందిన 37 గొర్రెలు గత నెలలో కుక్కల దాడిలో మరణించాయి. సుమారు రూ. 4 లక్షల విలువైన గొర్రెలు మృత్యువాతపడ్డంతో తీవ్రంగా నష్టపోయాడు. ముగ్గురు ఆడపిల్లలతో పేద కుటుంబీకుడికి ఇలా జరగడంతో స్థానిక నాయకులు సమస్యను ఎంపీ అంబికా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన బాధితుడి సమస్యను ముఖ్యమంత్రికి లేఖ రాశారు. స్పందించిన సీఎం చంద్రబాబునాయుడు తక్షణమే బాధితుడికి రూ. 2.40 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేశారు. దీనికి సంబంధించిన చెక్కును ఎంపీ బాధిత కుటుంబానికి తన క్యాంపు కార్యాలయంలో అందించారు. శ్రీనివాసులు ముఖ్యమంత్రికి, ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

అనంతలో సెమీఫైనల్స్


హేక్తాన్‌లో పాల్గొనే జట్లతో ప్రొఫెసర్లు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రీజియన్‌కు సంబంధించిన క్వాంటం వ్యాలీ హేక్తాన్ సెమీ ఫైనల్స్ అనంతపురంలో జరగనున్నట్లు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు తెలిపారు. మంగళవారం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హేక్తాన్‌లో భాగంగా ఇంటర్నల్ హేక్తాన్ నిర్వహించారు. అన్ని కళాశాలలో ఇంటర్నల్ హేక్తాన్ చేపట్టారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఎనిమిది టీంలు పాల్గొనున్నట్లు తెలిపారు. వాటి నుంచి టాప్ ఐదు టీంలను గుర్తించి అమరావతి క్వాంటం వ్యాలీ హేక్తాన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. వీటిలో నుంచి రెండు టీమ్స్ సెమీ ఫైనల్‌కు వెళతాయన్నారు. కార్యక్రమం డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ భారతి, ప్రొఫెసర్లు శోభాబిందు, మాధవి, శివకుమార్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

సమస్యల స్వాగతం

నేడు పీఆర్ ఎస్‌ఈ బాధ్యతల స్వీకరణ

ఎన్నెన్నో సవాళ్లు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ (పీఆర్) సూపరిండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ)గా బాధ్యతలు చేపట్టనున్న చిన్న సుబ్బరాయుడుకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎస్‌ఈ కార్యాలయంలో ఉదయం ఇంజనీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు చేపట్టాలంటే ఇంజనీర్లకు ఇబ్బందిగా మారింది. నూతన నిబంధనలతో తిప్పలు పడుతున్నారు. ఇదివరకు చేసిన అభివృద్ధి పనుల్లోనే నిబంధనలు పాటించలేదంటూ కేంద్ర బృందం ఆక్షేపించింది. వివరణ ఇవ్వాలని కోరింది. దీంతో ప్రస్తుతం చేస్తున్న పనుల్లోనైనా నిబంధనలు పాటించాల్సిందేనని ఉన్నతాధికారులు హుకుం జారీ చేసినట్లు తెలిసింది. అది ఆచరణ సాధ్యం కాదన్న ప్రచారం సాగుతోంది. దీంతో నూతన ఎస్‌ఈ సమావేశంలో తగు నిర్ణయం తీసుకుని, నూతన పనుల్లో అమలు చేయాల్సి ఉంది. ప్రధానంగా 10 శాతం లేబర్ పేమెంట్ చేయాలన్న నిబంధన ఇబ్బందికరంగా మారింది. ఒకే ప్రాంతంలో రెండు కంటే ఎక్కువ పనులు ఒకే కాంట్రాక్టర్ చేపట్టకుండా చూడాలన్న నిబంధన కూడా ఇబ్బందికరంగా ఉంది. ఒకే పనిలో ఇద్దరు, ముగ్గురు కాంట్రాక్టర్ల భాగస్వామ్యం ఉండేలా చూడాలన్న నిబంధనలున్నాయి. మెటీరియల్ ఒకరు సరఫరా చేస్తే.. మరొకరు పనులు చేయించాల్సి ఉంటుంది. ఇవి క్షేత్రస్థాయిలో సాధ్యపడవన్న చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో నూతన ఎస్‌ఈ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారోనన్న చర్చ సాగుతోంది.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వర్షం కురిసింది. విడపనకల్లులో ఓ మోస్తారుగా కురవగా, అనంతపురం, బెళుగుప్ప, గుత్తి, ఉరవకొండ, పుట్లూరు, యాడికి, పామిడి, గుంతకల్లు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. సోమవారం జిల్లాలోని 11 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా శింగనమల 15.4 మి.మీ. వర్షపాతం నమోదయింది. కూడేరు 12.2, గుంతకల్లు 6.2, గార్లదిన్నె 5.4, డి. హిరేహాల్ 5.2 మి.మీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో 3.8 మి.మీలోపు వర్షపాతం నమోదయింది.

మరో 13 మంది సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం విద్య, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాలలో భాగంగా మరో 13 మంది అభ్యర్థులతో సెలెక్షన్ జాబితాను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు. ఎంపికైన అభ్యర్థులకు రాష్ట్రశాఖ నుంచే మెసేజ్‌లు పంపారు. ఆ అభ్యర్థులందరికీ మంగళవారం జిల్లా కేంద్రంలోని పీవీకేకే ఎంబీఏ కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. ఇప్పటి వరకు 807 టీచర్ పోస్టులకు గాను 770 మంది సెలెక్షన్ జాబితా విడుదలయిందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

'పీఎంశ్రీ స్కూళ్లను ఆదర్శంగా నిలపాలి'

అనంతపురం విద్య, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ స్కూళ్లను ఆదర్శంగా నిలపాలని హెచ్‌ఎంలకు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ సూచించారు. పీఎంశ్రీ స్కూళ్ల హెచ్‌ఎంలకు స్థానిక గుత్తిరోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఏపీసీ మాట్లాడారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించే ఉద్దేశంతో ఉన్నత పాఠశాలల్లో పీఎంశ్రీ ద్వారా వసతులు కల్పిస్తున్నారన్నారు. పిల్లలకు వాటిని అందించేందుకు ప్రతి హెచ్‌ఎం చిత్తశుద్ధితో కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓలు, స్కౌట్స్ సెక్రటరీలు, ఆర్‌పీలు, ఏఎంఓ ఫణిరాజ్, జీసీడీఓ కవిత పాల్గొన్నారు.

చెస్ క్రీడాకారుడికి ఎమ్మెల్యే స్పాన్సర్

శిక్షణకు రూ.5 లక్షలు ప్రకటించిన అమిలినేని

ఖర్చుల కోసం మరో రూ.50 వేలు


క్రీడాకారుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ చెస్ శిక్షణకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సాయం ప్రకటించారు. పలు టోర్నీల్లో విజేతగా నిలుస్తున్నా.. భారత్ తరఫున ఆడేందుకు ఎంపికైన బాలుడిని ఎమ్మెల్యే మంగళవారం అనంతపురంలోని ఎస్‌ఆర్‌సీ కార్యాలయంలో సత్కరించారు. బాద్‌లోని ఓ అకాడమీలో మెరుగైన శిక్షణ ఇప్పించేందుకు ఎమ్మెల్యే.. ఎస్‌ఆర్‌సీ ట్రస్టు తరఫున రూ.5 లక్షలు స్పాన్సర్ చేశారు. ఖర్చుల కోసం రూ.50 వేల నగదు అందజేశారు. అంతర్జాతీయ పోటీల్లో చాంపియన్‌గా అవతరించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

జాతీయ చెస్ పోటీల్లో ఉదయ్‌కుమార్ ప్రతిభ


చెస్ ఆడుతున్న ఉదయ్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ చెస్ పోటీల్లో నగరానికి చెందిన ఉదయ్‌కుమార్ మెరుగైన స్థానం సాధించాడు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన ఐఎం సాగర్‌షా విజినరీ చెస్ టోర్నీలో దేశవ్యాప్తంగా 295 మంది కోచ్‌లు పోటీ పడ్డారు. నగరానికి చెందిన సీనియర్ చెస్ కోచ్ ఉదయ్‌కుమార్ 8పాయింట్లకు 6.5 పాయింట్లు సాధించి ఓపెన్ కేటగిరీలో పతకం సాధించాడు. నగదు బహుమతి కూడా అందుకున్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనంతపురం, సత్యసాయి జిల్లాల పరిధిలో ఎనిమిది ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం విజిలెన్స్ అధికారులు వ్యవసాయ అధికారులతో కలసి ఎనిమిది దుకాణాల్లో తనిఖీలు చేయగా.. రెండు దుకాణాల్లో ఎరువుల నిల్వలు, ఈపోష్ మిషన్‌లో ఉన్న నిల్వల డేటాకు తేడా గుర్తించారు. రూ. 19.63 లక్షల విలువైన పలు రకాల 61.75 మెట్రిక్ టన్నుల ఎరువులను తాత్కాలికంగా విక్రయించరాదంటూ వ్యవసాయ అధికారులు నోటీసులు ఇచ్చారు. తనిఖీలపై రీజనల్ విజిలెన్స్ మానిటరింగ్ ఆఫీసర్ వైబీటీఏ ప్రసాద్ మాట్లాడుతూ.. యూరియాను కృత్రిమ కొరత సృష్టించరాదన్నారు. అధిక ధరలకు అమ్మడం, స్టాకు ఉన్నా... నో స్టాక్ బోర్డు పెట్టడం సరికాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో డీఎస్పీ నాగభూషణం, ఎస్‌ఐ నరేంద్ర భూపతి, ఏఓ వాసుప్రకాష్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని ప్రతిభ


విద్యార్థిని నిత్యశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ షారోన్ సోనియా

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న నిత్యశ్రీ రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో విజేతగా నిలిచింది. దీంతో మంగళవారం స్థానిక వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షారోన్ సోనియా, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరదేశినాయుడు.. విద్యార్థినిని అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. 'భారతీయ సంప్రదాయాలపై స్వామి వివేకానంద ముద్ర' అనే అంశంపై రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారన్నారు. విశాఖలో ఏర్పాటుచేసిన పోటీల్లో నిత్యశ్రీ విజేతగా నిలిచి, రూ.10వేల నగదు దక్కించుకుందని ప్రిన్సిపాల్ వివరించారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ.14 వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 831 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి టీటీ పోటీల్లో పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈషా సంజనకు రాష్ట్రస్థాయి టీటీ పోటీల్లో పతకాలు దక్కాయి. ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్-2025 పోటీలకు జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించగా ఈషా సంజన అండర్-17 బాలికల విభాగంలో బంగారు పతకం, అండర్-19 బాలికల విభాగంలో రజత పతకాలు సాధించింది. మంగళవారం స్థానిక అనంతపూర్‌క్లబ్‌లోని ఇండోర్‌స్టేడియంలో జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మాజీ అధ్యక్షుడు మురళీధర్‌రావు, ఉపాధ్యక్షుడు ఎంవీ పాండురంగయ్య, సభ్యులు సూర్యనారాయణ, అగిశం రంగనాథ్, కోచ్‌లు రవీంద్రనాథ్, వంశీకృష్ణ విజేత ఈషా సంజనను అభినందించారు.

అసిస్టెంట్ ఐఈడీ సెక్టోరల్ పోస్టుకు నోటిఫికేషన్

అనంతపురం విద్య, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష శాఖలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఐఈడీ సెక్టోరల్ పోస్టుకు మంగళవారం ఏపీసీ శైలజ నోటిఫికేషన్ విడుదల చేశారు. స్కూల్ అసిస్టెంట్లు ఐదేళ్ల సర్వీస్, ఎస్జీటీలకు 10 ఏళ్ల సర్వీస్ ఉండి జంతుశాస్త్రం, మనస్తత్వశాస్త్రం నందు పీజీ పూర్తిచేసి డీఎడ్, బీఎడ్‌లో ప్రత్యేక విద్య చేసినవారు ఈ పోస్టుకు అర్హులని తెలిపారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండి, 55 ఏళ్ల వయసు కన్నా తక్కువ ఉన్నవారు అర్హులని అన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈనెల 6వతేదీలోగా దరఖాస్తులను జిల్లా ఎస్‌ఎస్‌ఏ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. కలెక్టర్ పర్యవేక్షణలో నిబంధనల మేరకు ఎంపిక చేస్తామన్నారు.

బొప్పాయికి మార్కెట్ సౌకర్యం కల్పిస్తాం

కలెక్టర్ వినోద్‌కుమార్


బొప్పాయి నాణ్యతను చూపుతున్న రైతు ఓబయ్య

కూడేరు, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బొప్పాయి సాగును మరింత ప్రోత్సహించే దిశగా ప్రత్యేక మార్కెట్ సదుపాయం కల్పిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కమ్మూరు గ్రామ రైతు ఓబయ్యకు చెందిన బొప్పాయి తోటను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. వర్షాకాలంలో బొప్పాయి దిగుబడిని కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడంలేదనీ, దీంతో నష్టపోతున్నామని రైతు ఓబయ్య చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బొప్పాయికి మార్కెట్ సౌకర్యం కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి, మంచి ధరలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ధనుంజయ, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ఉపాధే లక్ష్యం

కియ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్డాంగ్ లీ


డ్రైవింగ్ లైసెన్స్ అందుకున్న యువకులతో కియ సిబ్బంది

పెనుకొండ రూరల్, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కియ ఇండియా పనిచేస్తోందని సంస్థ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్డాంగ్ లీ పేర్కొన్నారు. మంగళవారం పలువురు నిరుద్యోగులకు డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంతపురం, హిందూపురం ఏపీఎస్ ఆర్టీసీ డిపోల్లో డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువతకు శిక్షణ ఇప్పించామని తెలిపారు. కార్పొరేట్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ డిపోల్లో హెవి డ్రైవింగ్ లైసెన్స్, శిక్షణకు 350 మంది నిరుద్యోగులకు ధ్రువపత్రాలు ఇప్పించామని తెలిపారు. అదేవిధంగా 650 మంది యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పరిగి మండలం కొడిగెనహళ్లి రెసిడెన్షియల్ కళాశాలలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

అటల్ ల్యాబ్స్‌తో పరిశోధనలకు దోహదం

- జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు



మాట్లాడుతున్న వీసీ సుదర్శన్‌రావు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అటల్ ల్యాబ్స్ ఉన్నత పాఠశాలల విద్యార్థుల పరిశోధనలకు ఎంతగానో దోహదపడతాయని జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం వీసీ సుదర్శన్‌రావు అన్నారు. మంగళవారం ఈఈఈ విభాగం సెమినార్ హాల్‌లో విశ్వవిద్యాలయం, ఉన్నత విద్యాశాఖ, బీసీడీఈ, యూనిసెఫ్, విగ్యాన్ ఆశ్రం సంయుక్తంగా అటల్ మెంటర్‌షిప్ వర్క్‌షాపు నిర్వహించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ సుదర్శన్‌రావు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో అటల్ ల్యాబ్స్ స్థాపించిందన్నారు. వీటిపైన అవగాహన కల్పించడానికి ఉన్నత విద్యాశాఖ, బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఎడ్యుకేషన్ సంయుక్తంగా విద్యార్థులకు ల్యాబ్స్‌పై శిక్షణ ఇస్తోందన్నారు. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి మాట్లాడుతూ..మూడురోజుల శిక్షణకు విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాల విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్యులు శ్రీనివాసులు, దేవకుమార్, సుదర్శన్, శైలజ, బాలమురళీకృష్ణ, వసుంధర పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.23

అనంతపురంరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 3వేల టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. అదేవిధంగా టమోటా కిలో కనిష్ఠ ధర రూ.14, సరసరా సరిధర రూ.18తో విక్రయాలు జరిగాయన్నారు.

న్యూస్ బాక్స్

విద్యుత్ మీటర్ రీడర్లకు వేతనాలు చెల్లించాలి



ధర్నాలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు రాజారెడ్డి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ రీడర్ల వేతనాలు, ఈపీఎఫ్, ఈఎస్‌ఐలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఈ కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాకు ఆయన హాజరై ప్రసంగించారు. స్మార్ట్ మీటర్లు వస్తున్న తరుణంలో మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ పోరాటం చేస్తుంటే కాంట్రాక్టర్లు మాత్రం మీటర్ రీడర్లకు రెండు నెలల వేతనాలు బకాయి పెట్టడం సమంజసం కాదన్నారు. విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమ్నా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, మీటర్ రీడర్ల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి రమేష్, కిరణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం ఇవ్వండి

● మంత్రి లోకేశ్‌కు నాయకుల వినతి



లోకేశ్‌కు వినతి పత్రం ఇస్తున్న బంగి నాగ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను అనంతపురం జిల్లాకు చెందిన పలువురు నేతలు కలిశారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గ పర్యటనకు వచ్చిన మంత్రిని తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగి నాగా ఇతర నేతలు కలిశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పార్టీలో ఉంటూ క్రమశిక్షణతో పనిచేస్తున్నామన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం ఇవ్వాలని కోరారు. బాషా, ఇతర నాయకులు పాల్గొన్నారు.

లేఅవుట్ పరిశీలన

రామగిరి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ననకోట గ్రామ ఎస్సీ, బీసీ కాలనీల్లో ఉన్న ఇంటి స్థలాల కోసం లేఅవుట్లను మంగళవారం టీడీపీనాయకులు, అధికారులు పరిశీలించారు. టీడీపీ నాయకుడు రామ్మూర్తినాయుడు, తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ పురుషోత్తం కలిసి లేఔట్లను పరిశీలించారు. ముత్యాలప్ప, కట్టుబడి రామాంజినేయులు, ఏపీ ముత్యాలు, శ్రీనివాసులు, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ

రామగిరి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండంలలోని గంగంపల్లి గ్రామంలో కొత్తగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను మంగళవారం టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. దూదేకుల ఖలీల్ భార్య పక్కీరమ్మ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమెకు డయాలసిస్ కోసం నెలకు రూ.10 వేలు పింఛన్ మంజూరు చేశారు. ఆ పింఛన్‌ను రామ్మూర్తినాయుడు పంచాయతీ కార్యదర్శి రామోజీ, ముత్యాలప్ప, బోయకుమార్, కురుబ మహేశ్ ఆమెకు అందజేశారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



ఆంజనేయులు(ఫైల్)

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు(55) అనే ఉపాధ్యాయుడు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. గ్రామానికి చెందిన ఆంజనేయులు అనంతపురంలో నివాసముంటూ రూరల్ మండలం ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తుండేవారు. రెండేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండేవారని బంధువులు తెలిపారు. పరిస్థితి విషమించడంతో రెండు రోజుల క్రితం కుటుంబసభ్యులు అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందారు. ఆంజనేయులుకు భార్య మాధవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

రెండు టిప్పర్ల సీజ్

శింగనమల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను శింగనమల పోలీసులు సీజ్ చేశారు. మంగళవారం రాత్రి ఉల్లికల్లు, జూలాకాలువ వంక ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను సీఐ కౌలుట్లయ్య దాడులు చేసి నాయనపల్లి క్రాస్‌లో సీజ్ చేశాడు

పేకాటరాయుళ్ల అరెస్టు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం సోముదలదొడ్డి వద్ద మంగళవారం రూరల్ పోలీసులు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. సోములదొడ్డి వద్ద ఓ ప్రైవేట్ షోరూం వెనుకవైపు పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. 8 మందిని అరెస్టుచేశారు. వారి నుంచి రూ.20,500 స్వాధీనం చేసుకున్నారు.

కాంగ్రెస్ పార్టీని తీర్చిదిద్దిన నేత రాజశేఖర్ రెడ్డి

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని తీర్చిదిద్దిన నేత అని ఆ పార్టీనాయకులు అన్నారు. మంగళవారం రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ కార్యాలయంలో ఘన నివాళులర్పించారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా, పీసీసీ అధ్యక్షుడిగా ఒక్కోమెట్టుగా రాజశేఖర్‌రెడ్డికి కాంగ్రెస్ బాటలు వేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉమ్మడి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన రాజశేఖర్‌రెడ్డి.. ప్రజానాయకుడిగా కీర్తిని పొందాడన్నారు. నాయకులు దాదా గాంధీ, శర్మాస్‌వలి, ఓబులేసు, ప్రకాష్, అహ్మద్, మసాల రవి, మహేంద్ర, నాగేంద్ర, నరసింహారెడ్డి, నూర్‌మొహ్మద్, రహ్మాన్, మహబూబ్‌బాషా, ఇమ్రాన్‌బాషా పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు ఘన నివాళి

అనంతపురం కలెక్టరేట్: దివంగత నేత, మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతిని పురస్కరించుకుని వైసీపీ శ్రేణులు ఘన నివాళి అర్పించారు. జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జడ్పీ కార్యాలయ ఆవరణంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రి వద్ద అనంతవెంకటరామిరెడ్డి అన్నదానం చేశారు. బీసీ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. తపోవనంలో లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. 4వ రోడ్డులో స్పందన ఫౌండేషన్‌లో వెన్నం శివారెడ్డి ఆధ్వర్యలో అన్నదానం చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు.



రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న దాదాగాంధీ

ప్రబలుతున్న విష జ్వరాలు

● ప్రతి ఇంట్లో ఒకరిద్దరు బాధితులు
● ఆస్పత్రులు కిటకిట



శింగనమల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

శింగనమల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజలు విషజ్వరాలతో అల్లాడుతున్నారు. మండలంలోని గ్రామాల్లో ప్రతి ఇంటిలో ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు. పదుల సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మండలంలోని నాయనవారిపల్లి, సలకంచెరువు, నాగులగుడ్డం, నాగులగుడ్డం తండా, గురుగుంట్ల తదితర గ్రామాల్లో ప్రజలు జ్వరాలు, వొళ్లనొప్పులతో బాధపడుతున్నారు. ప్రతి రోజూ పేదలు శింగనమల కమ్యూనిటీ ఆస్పత్రి, తరిమెల ప్రాథమిక ఆస్పత్రికి వస్తున్నారు. ప్రతి గ్రామంలో సీజనల్ వ్యాధులు అధికమయ్యాయి. వర్షాలు కురుస్తుండటంతో రోడ్లపై వర్షం నీరు నిలిచి రోగాలు ప్రబలుతున్నాయని ప్రజలు అంటున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. వైద్యాధికారులు రోగాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వరపీడితులకు స్థానికంగా చికిత్స అందిస్తే కొంతవరకు ఉపశమనం కలుగుతుందని అంటున్నారు.

జ్వరాలపై అవగహన కల్పిస్తున్నాం: శంకర్ నాయక్, వైద్యాధికారి, తరిమెల

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న మాట వాస్తవమే. ప్రజలు జ్వరాలు, ఒళ్లునొప్పులతో బాధపడుతూ ఆస్పత్రికి చికిత్స కోసం వస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రజలు పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలి. జ్వరం వచ్చిన వెంటనే ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలి.

11న మండల సర్వసభ్య సమావేశం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ దివాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11గంటలకు స్థానిక కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఉంటుందన్నారు. అధికారులు సమావేశానికి మూడురోజుల ముందుగానే శాఖల ప్రగతి నివేదికలు ఇవ్వాలన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పని సరిగా హాజరుకావాలన్నారు.

పీఎం సూర్యఘర్‌తో ఎంతో ప్రయోజనం: ఎమ్మెల్యే

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంతో పేదలకు మరింత విద్యుత్ ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక అనంత నగరపాలక సంస్థ న్యూ కాన్ఫరెన్స్‌హాల్‌లో మెప్మా ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగకరంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పీఎం సూర్యఘర్ పథకం తీసుకువచ్చారని తెలిపారు. సబ్సిడీతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే ఉచిత విద్యుత్ అందుతుందని తెలిపారు. అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పీఎం సూర్యఘర్ యోజన పథకం ప్రాధాన్యం, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహ, కొండన్న, మెప్మా సిబ్బంది, సీఓలు, ఆర్‌పీలు, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

హరిత అనంతే లక్ష్యం

అనంతపురం క్రైం: హరిత అనంతే లక్ష్యంగా ముందుకు సాగుదామని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో మొక్కలనాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ బాలాస్వామి, ఇతర అధికారులు, నాయకులతో కలసి ఆయన మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ..నగరాన్ని హరిత అనంతగా మార్చడమే తన లక్ష్యమన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రమణ్యం, కోనంకి గంగారామ్, డీఈ నరసింహులు, పరమేశ్వర్, బల్లా పల్లవి, సరళ, గోళ్ల సుధాకర్‌నాయుడు, నెట్టెం బాలకృష్ణ, నాగభూషణం, ముస్తాక్, జయరాంనాయక్ పాల్గొన్నారు.

ప్రజాప్రయోజనాలకు సహకరించాలి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన పనులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో తాడిపత్రి ప్రాంతానికి చెందిన పలువురు రైతులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం తాడిపత్రి మండలం గన్నెవారిపల్లిలో రైల్వే లెవెల్ క్రాసింగ్ నెం.159పై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరగనున్న నేపథ్యంలో ప్రైవేట్ భూముల కొనుగోలు అవసరముందన్నారు. భూ సేకరణకు సంబంధించి ఆ భూమి యజమానులైన రైతులు పరిహారం చెల్లింపు విషయంలో సహకరించాలని కోరారు. ప్రస్తుతం 3.79 ఎకరాల పట్టా భూమి భూ సేకరణ నిమిత్తం చట్టపరంగా న్యాయం చేస్తామన్నారు. వ్యవసాయ భూమి కేటగిరికి చెందిన 2.21 ఎకరాల భూములకు ఎకరాకు రూ.38లక్షల చొప్పున సమావేశంలో పరిహారాన్ని నిర్ణయించి తీర్మానించారు. పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని 15 గ్రామాల్లో అదానీ రెన్యువబుల్ ఎనర్జీ ద్వారా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌మిషన్ టవర్ల నిర్మాణం కోసం సంబంధించి గ్రామాల రైతులతో పరిహారం చెల్లింపు విషయంపై కలెక్టర్ చర్చించారు. డీఆర్‌ఓ మలోల, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ సోమశేఖర్, భూ సేకరణ విభాగం తహసీల్దార్ రియాజ్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ సమస్యలను పరిష్కరించాలి: అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చే అర్జీలు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈపీటీఎస్ పోర్టల్‌లో ఏజెంట్ స్పేస్ డాక్యుమెంట్లు అప్‌లోడ్ రోజు వారిగా 100కు తక్కువ కాకుండా చేయాలన్నారు. రైతు ఖాతాలకు సంబంధించి ఎన్పీసీఐ పెండింగ్ లింకింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని, వెబ్‌ల్యాండ్ కరెక్షన్ అంశాలు తదితరాలను బాధ్యతగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, జెడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్: రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ విధుల్లో చేరారు. దాదాపు రెండు నెలల పాటు దీర్ఘకాలిక సెలవులో ఉన్న భార్గవ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసులు కొనసాగారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ నాయుడు డిమాండ్ చేశారు. ఆమేరకు గ్రామ పంచాయతీల కార్మికులు, సీఐటీయూ ఆధ్వర్యంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిధిలోని పంచాయితీల కార్మికులతో కలసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయితీ కార్మికులందరికీ ఒకే వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. గోపాల్, శివప్రసాద్ పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచండి

శింగనమల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాలని ఎంపీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అధికారుల సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ యోగేశ్వరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ రఘు మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, వైస్‌ఎంపీపీ విజయమ్మ, అధికారులు, సీడీపీఓ లలితమ్మ, విజయ్, కిరణ్, నరసింహరాజు, రవీంద్రరెడ్డి, భాగ్యలక్ష్మి, సర్పంచులు డేగల లలితమ్మ, నాగమునెమ్మ, రాజీ పాల్గొన్నారు.

పత్తి దిగుమతిపై సుంకం తగ్గింపు జీవోను ఉపసంహరించుకోవాలి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పత్తి దిగుమతిపై సుంకం తగ్గింపు జీవోను ఉపసంహరించుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సోములదొడ్డి గ్రామంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతాంగ కోర్కెల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై ఆయన జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ..కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయన్నారు. అధికారంలోకి రాకముందు రైతేరాజు.. రైతులేనిదే రాజ్యం లేదని గొప్పలు పలకడం అధికారంలోకి వచ్చిన తర్వాత చెప్పిన మాటాలను మరిచిపోవడం పరిపాటైందన్నారు. ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయం మద్ధతు ధరల చట్టం అమలు చేయాలన్నారు. నాయకులు రమేష్, శ్రీకాంత్, నరేష్, దుర్గాప్రసాద్, రెడ్డప్పరెడ్డి, నరసింహులు, రాము, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆత్మీయ కలయికను విజయవంతం చేయండి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కుమ్మర శాలివాహన కుల ఆత్మీయుల కలయిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ సత్యసాయి జిల్లా కుమ్మర సాధికార సమితి కన్వీనర్ రామాంజనేయులు పిలుపునిచ్చారు. మండలంలోని సిండికేట్ నగర్‌లో రాష్ట్ర డైరెక్టర్ ఓబుళపతి, తెలుగురైతు ప్రధాన కార్యదర్శి యాలేటి గోపాల్‌తో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 4 నుంచి 9వతేదీ వరకు కుమ్మర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్ ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తారన్నారు. 4న రాచానపల్లి కుమ్మరి శాలివాహన కమ్యూనిటీ భవనంలో ఆత్మీయ కలయిక కార్యక్రమం ఉంటుందన్నారు. మలరాయుడు, రామకృష్ణ, ఆంజనేయులు, శివ, మల్లికార్జున పాల్గొన్నారు.

ఐద్వా మహాసభలను జయప్రదం చేయండి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని లలిత కళా పరిషత్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఐద్వా జిల్లా 7వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం కోశాధికారి సావిత్రి మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. మహాసభలకు అఖిల భారత నాయకురాలు పుణ్యవతి, డాక్టర్ హేమలత, డాక్టర్ ప్రసూన ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగిస్తారన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నార్పల,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీపీఎంఓ బాల ఓబులు సూచించారు. మండలంలోని బీ పప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ హాజీరా ఆధ్వర్యంలో మంగళవారం పోషకాహారం, క్షయ, కుష్ఠు వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా, డెంగీ వ్యాధులపై వైద్యసిబ్బందికి తగు సూచనలు చేశారు. సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.

పంట నమోదును వేగవంతం చేయండి

రాప్తాడు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంట నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ సూచించారు. మండలంలోని ప్రసన్నాయపల్లి, రాప్తాడు ఆర్ఎస్‌కే పరిధిలోని పంట నమోదును ఆయన పరిశీలించారు. ఏఓ కృష్ణ చైతన్య, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జ్ గిరిధర్, భారతి, సోనియా పాల్గొన్నారు.

ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు



చీరల పంపిణీలో పాల్గొన్న భవాని రవికుమార్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ భవాని రవికుమార్ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో దుప్పట్లు పంపిణీ చేశారు.

నార్పల: ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలోని సత్యసాయిధ్యాన మండలి, అనాథ శరణాలయంలో కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నియోజక సమన్వయకర్త సాకే మురళీకృష్ణ ఆధ్వర్యంలో చిన్నారులతో కలిసి అధినేత పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రిగా చూడాలని ప్రార్థనలు చేశారు. మండల కన్వీనర్ రామకృష్ణ, భాస్కర్, ఎర్రిస్వామి, రామయ్య, షేక్ రహంతుల్లా, నరసింహులు, శివరాయల్, నారాయణస్వామి, రాజకుళ్లాయప్ప, శ్రీధర్‌బాబు, లోకేష్, గంగాధర్, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

రామగిరి: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జనసేన మండల కన్వీనర్ నారాయణ, ఎంపీటీసీ సంపత్‌కుమార్‌తోపాటు అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పేరూరులో కొల్లాపురమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు సుబ్బురాజ, శ్రీనివాసులు, శ్రీరాములు, ఇనయ్‌తుల్లా, రామ్మూర్తి, వడ్డిశ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఉప ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

శింగనమల: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన పార్టీ నాయకులు నియోజకవర్గం కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రామస్వామి దేవాలయంలో పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాకే మురళీకృష్ణ, మండల కన్వీనర్ తోట ఓబిలేసు శుభాకాంక్షలు తెలిపారు.



శింగనమల ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్డు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

అంబులెన్స్ డ్రైవర్లకు అండగా ఉంటాం

● సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ముర్తుజా



మాట్లాడుతున్న ముర్తుజా

అనంతపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు భగత్‌సింగ్ ప్రైవేట్ అంబులెన్స్ స్టాండ్‌లోని డ్రైవర్లు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ముర్తుజా అన్నారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రి ఎదుట ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు ప్రజానుకూలంగా ఒక పద్ధతి ప్రకారం సీరియల్‌గా బాడుగలకు వెళ్తూ, తాము వెళ్లే బాడుగల రూట్ల రేట్లు పట్టికల ద్వారా ప్రకటించి, తక్కువ బాడుగలకు సేవలందిస్తున్నారన్నారు. నిజాయతీగా అంబులెన్స్ సేవలందిస్తున్న డ్రైవర్లను ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఎస్సీ ఎస్టీ జేఏసీ సాకే హరి, బీఎస్పీ ఓబులేసు, పసులూరి ఓబలేసు, జీవరత్నం, రాజా, వలి, గోపాల్, ఎన్టీఆర్ శ్రీనివాసులు, రాజేష్, నాగేంద్ర, మహేష్, నరేష్, అమర్నాథ్, అక్బర్, జిలాన్, ఆశారాజు, అశోక్, గోపాల్ పాల్గొన్నారు.

పార్కు ఏర్పాటు చేయండి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ ఐజీ నగర్ పక్కన ఉన్న ఓపెన్ సైట్ కబ్జాకు గురి కాకుండా పార్కు ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డీపీఓ కార్యాలయంలో ఏఓను కలసి వినతి పత్రం ఇచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేశవరెడ్డి మాట్లాడుతూ కక్కలపల్లి గ్రామ సర్వే నంబరు 21లో 8.91ఎకరాల్లో 2007లో లేఅవుట్ వేశారన్నారు. ప్రజా అవసరాల నిమిత్తం 44సెంట్లు అప్పట్లోనే వదిలారన్నారు. గత కొంత కాలంగా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ పార్టీల పేరుతో స్థలాన్ని ఆక్రమించాలని చూస్తున్నారన్నారు. ఇటీవల ప్రయత్నాలు చేసి సీపీఐ ఆధ్వర్యంలో అడ్డుకోవడం జరిగిందన్నారు. ఓపెన్ సైట్‌లో అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయడం వలన ఉపయోగం ఉంటుందన్నారు. అక్కులప్ప, వెంకటరాముడు పాల్గొన్నారు.


జడ్పీలో కారుణ్య నియామకాలు



నియామకపత్రాలు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో 9 మందికి కార్యాలయ సబార్డినేట్స్‌గా మంగళవారం కారుణ్యనియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం సీఈఓ శివశంకర్ ఆధ్వర్యంలో చేపట్టారు. ముఖ్య అతిథిగా చైర్‌పర్సన్ గిరిజమ్మ హాజరై నియామకపత్రాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ నూతనంగా నియామకాలు పొందిన వారు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి ప్రజలకు మంచి సేవలందించేలా చూడాలన్నారు. డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మమత, మడకశిర పీఆర్ఐ సబ్‌డివిజన్‌కు నియమించారు. శోభా, మడకశిర మండల పరిషత్ కార్యాలయం, రాఘవేంద్రరావు శెట్టూరు, శకుంతల సీకేపల్లి, భార్గవి చుక్కలూరు, ప్రసన్నకుమార్, దీపక్‌లకు జడ్పీ కార్యాలయం కేటాయించారు. బండ నవాజ్‌కు పీఐయూ కార్యాలయంలో నియమించారు. ధనలక్ష్మికి బుక్కరాయసముద్రం ఎంపీడీఓ కార్యాలయం కేటాయించారు.

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి



ఫార్మాసూటికల్ సైన్స్ కళాశాలలో అపరిశుభ్రతను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఫార్మాస్యూటికల్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్ సూచించారు. మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమం చేపట్టారు. కళాశాల ఆవరణంలో పిచ్చిమొక్కలను తొలగించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి జ్యోత్స్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

చెత్త సేకరణపై అవగాహన

బెళుగుప్ప, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకంపల్లి గ్రామంలో జెడ్పీసీఈఓ శివశంకర్, కాలువపల్లి, హనిమిరెడ్డిపల్లి గ్రామాల్లో డివిజనల్ అభివృద్ధి అధికారి నాగేశ్వరరావు మంగళవారం పర్యటించారు. చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు సూచించారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈఓఆర్డీ శివరంజని, సెక్రెటరీలు, వెంకటేశులు, గోపాల్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వాడకం.. సెల్‌ఫోన్ దుర్వినియోగంతో కలిగే అనర్థాలపై మేర యువ భారత స్టేట్ కో-ఆర్డినేటర్ బిసాతి భరత్ స్థానిక శ్రీ శంకరానంద గిరి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిగమా ఫౌండేషన్ సహా వ్యవస్థాపకురాలు వసుంధర, కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్, ప్రిన్సిపాల్ వరప్రసాద్ పాల్గొన్నారు.

సిబ్బందికి సీవైడీబీ టెస్టింగ్

పామిడి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎద్దులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య, ఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సూపర్‌వైజర్లకు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ సీవైడీబీ టెస్టింగ్ మంగళవారం చేశారు. టీబీ బారిన పడకుండా కాపాడేందుకు సీవైడీబీ టెస్టింగ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ సుస్నీర్ బాషా, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీరామిరెడ్డి, సుధాకర్, ఏఎన్‌ఎంలు సూర్యకళ, తులసమ్మ పాల్గొన్నారు.

డిజిటల్ చార్టుపై డిపో మేనేజర్ నిర్లక్ష్యం

ఉరవకొండ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ నూతన డిజిటల్ చార్టు వేయడంలో డిపో మేనేజర్ హంపన్న నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏపీపీటీడీ కార్మిక పరిషత్ నాయకులు రామాంజినేయులు, వెంకటేశులు ధ్వజమెత్తారు. మంగళవారం ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డిజిటల్ చార్టు కోసం ఆరు నెలల నుంచి కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కార్మిక పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో జునైరా ప్రతిభ



గుంతకల్లు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో జరిగిన ఇంటర్నేషనల్ రాపిడ్ ఇండిపెండెన్స్ క్లిప్ టోర్నమెంటులో స్థానిక సెయింట్ పీటర్స్ స్కూల్ విద్యార్థిని నిజాం జునైరా నుమా ప్రతిభను చాటింది. ఈ విద్యార్థిని అనంతపురం, కర్నూలు జిల్లాల రాపిడ్ చెస్ విభాగంలో 1698 రేటెడ్ ప్లేయర్‌గా నిలిచిందని, అంతేకాకుండా బ్లిట్జ్ విభాగంలో 1546 రేటింగ్‌ను పొందిందని శిక్షకుడు అనిల్ కుమార్, రామారావు మంగళవారం తెలిపారు. ఈ మేరకు ప్రపంచ చదరంగ సమాఖ్య, అఖిల భారత చదరంగ సమాఖ్య ఫలితాలను విడుదల చేశాయన్నారు.

మస్తాన్ వలి ఆధ్వర్యంలో అన్నదానం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మిలాదునబీ పండుగ సందర్భంగా స్థానిక గుంతబావి వీధిలో మస్తాన్ వలి యూత్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఫాతేహాలు నిర్వహించారు. అనంతరం దాదాపు రెండు వేల మందికి అన్నదానం చేశారు.

టీబీని నివారిద్దాం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి.. టీబీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా లెప్రొసి అధికారి డాక్టర్ అనుపమజేమ్స్ సూచించారు. మంగళవారం బొమ్మనహాళ్, మండలంలోని శ్రీధరఘట్ట ప్రాథమిక ఆసుపత్రిలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్షలు నిర్వహించి.. ప్రాథమిక దశలోనే వ్యాధులు గుర్తించి.. సరైన చికిత్సలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యారా మెడికల్ అధికారులు నాగన్న, రమణ, నీలకంఠ, స్థానిక సిబ్బంది శివప్రసాద్, అత్తార్‌బాబు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

శెట్టూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బచ్చేహళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జీ గంగారెడ్డి అదే పాఠశాలకు రూ. 20 వేలు విలువ చేసే అహుజా మైక్ సెట్‌ను విరాళంగా ఇచ్చాడు. దాన్ని ఎంఈవో శ్రీధర్‌కు మంగళవారం ఆయన అందజేశారు.

రైల్ హైస్పీడ్ టెస్ట్ రన్

గుంతకల్లు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):గుంతకల్లు-గుంటూరు లైన్ డబ్లింగ్ పనుల్లో భాగంగా పూర్తిచేసిన నంద్యాల-పాణ్యం సక్షన్ ట్రాక్‌పై హైస్పీడ్ ట్రెయిన్ టెస్ట్ డ్రైవ్‌ను మంగళవారం నిర్వహించారు. గుంతకల్లు నుంచి పాణ్యంకు వెళ్లిన డీఆర్‌ఎం చంద్రశేఖర్, డిప్యూటీ సీఆర్‌ఎస్ అధికారులు, వివిధ రైల్వే శాఖల అధికారులు ట్రాక్ తనిఖీల్లో పాల్గొన్నారు. ట్రాక్, లింకింగ్‌ల పరిస్థితిని పరిశీలించారు.

భూమి కేటాయింపును రద్దు చేయాలి



మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

గుత్తి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సోలార్ ప్రాజెక్టులకు భూమిని కేటాయించే విధానాన్ని రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్ల లీజు ఒప్పందం వల్ల రైతు దీర్ఘ కాలంలో భూమి మీద హక్కు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. లీజు ఒప్పందం పది సంవత్సరాలు దాటకుండా ఉండాలని, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కౌలు 30 శాతం అదనంగా కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లానాయకులు దస్తగిరి, ఈశ్వర్‌రెడ్డి, కేవీపీఎస్ మండల కార్యదర్శి మల్లికార్జున, సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, నాయకులు మల్లేష్, రేణుకమ్మ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఉరవకొండ,సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన 18 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ 8.84 లక్షలు మంజూరైంది. ఆ చెక్కులను అనంతపురంలోని రాంనగర్‌లో టీడీపీ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు బాధితులకు మంగళవారం అందజేశారు.

లింగ వివక్షను రూపుమాపాలి: డీఎంహెచ్‌ఓ



గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసులు డెకాయ్ ఆపరేషన్ ద్వారా సమాజంలో లింగ వివక్షను రూపుమాపాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీబీ దేవి పేర్కొన్నారు. లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై అర్బన్ సచివాలయ మహిళా పోలీసులకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డివిజన్‌లో ఎక్కడా గర్భస్థ లింగ నిర్ధారణ జరగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డెమో డిప్యూటీ హెచ్‌ఓ త్యాగరాజు, పీపీ యూనిట్ వైద్యులు గంగాధర్, అరుణ, హరిత, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, వేణుగోపాల్, ఎంఓ అసిస్టెంట్ రియాజ్ పాల్గొన్నారు.

సమయ పాలన ఏదీ?

అందుబాటులో ఉండని శ్రీధరఘట్ట సొసైటీ సిబ్బంది



ఉదయం 11 గంటలైనా తాళం తీయని శ్రీధరఘట్ట సొసైటీ కార్యాలయం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారులు, సిబ్బంది సమయపాలన లేక... ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు. రైతులు ఎరువులు, విత్తనాలు, బ్యాంకు రుణాలు తదితర వాటి కోసం వస్తున్న రైతులు.. ఆ సొసైటీ కార్యాలయం తాళం వేసి ఉండటంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. సొసైటీ సీఈఓ, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రైతు లు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఉదయం 11 గంటలైన సొసైటీ తలుపులు తీయకపోవడంపై అంతవరకూ నిరీక్షించిన రైతులు.. వెనుతిరిగారు.సొసైటీ ఉద్యోగుల పనితీరుపై పర్యవేక్షణ లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, సొసైటీ సిబ్బంది అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతుల సంక్షేమమే టీడీపీ ధ్యేయం: ఎమ్మెల్యే



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

యాడికి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ ధ్యేయమని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం అందించిన సబ్సిడీ వ్యవసాయ డ్రోన్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. డ్రోన్ పనితీరును లబ్ధిదారుడు పరిమి చరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.10 లక్షలు విలువగల వ్యవసాయ డ్రోన్‌ను రైతు వాటా రూ.2లక్షలు, ప్రభుత్వ సబ్సిడీ రూ.8 లక్షలతో ప్రభుత్వం అందిస్తోందన్నారు. డ్రోన్ ద్వారా పంటలకు మందులను పిచికారి చేసుకోవచ్చన్నారు. డ్రోన్ వాడకం ద్వారా మందులు, సమయం ఆదా అవుతాయన్నారు. రైతులు డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట ఏఓ మహబూబ్‌బాషా, యాడికి, వేములపాడు సింగిల్‌విండో చైర్మన్లు చలమారెడ్డి, నాగమునిరెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, నాయకులు రవికుమార్‌రెడ్డి, మాదాల అనిల్, బయపురెడ్డి, విశ్వనాథ్ ఉన్నారు.

● ఉచితంగా డ్రోన్ సేవలు అందిస్తా

రైతులు సహకారం అందిస్తే మందుల పిచికారికి డ్రోన్ సేవలను ఉచితంగా అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు డ్రోన్ లబ్ధిదారుడు పరిమి చరణ్ తెలిపారు. వ్యవసాయ డ్రోన్‌ను పంట పొలాల వద్దకు తన సొంత ట్రాక్టర్‌లో పంపిస్తానని, డ్రోన్ రవాణాకు సంబంధించి రైతులు కేవలం డీజిల్ బిల్లు చెల్లించుకుంటే తాను ఉచితంగా సేవ అందిస్తానని తెలిపారు.

● అభివృద్ధిపై సమీక్ష

యాడికిలోని సమావేశ భవనంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే చేపట్టాల్సిన అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడారు. యాడికిలో పారిశుధ్యం మెరుగుపడాలని, మురుగు సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని డిప్యూటి ఎంపీడీఓ శశికళను ఆదేశించారు. ప్రభుత్వ వైద్యశాల మరమ్మతు పనులను పరిశీలించారు. సమావేశంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, ఏఓ మహబూబ్ బాషా, పంచాయతీరాజ్ డీఈ యల్లమనాయుడు, ట్రాన్స్‌కో ఏఈ విజయ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దేవకుమార్, ఎంఈఓ కాశప్ప, ఏపీఓ మద్దిలేటి పాల్గొన్నారు.

ఉండబండ రోడ్డుకు మరమ్మతులు



రెండోసారి రోడ్డు వేస్తున్న సిబ్బంది

విడపనకల్లు సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉరవకొండ నుంచి ఉండబండ మీదుగా పాల్తూరు గ్రామానికి ఇటీవల వేసిన రోడ్డు అప్పుడే ఎక్కడ పడితే అక్కడ పగిలిపోయింది. దీనిపై ఆంధ్రజ్యోతి ఆదివారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఆర్ అండ్ బీ అధికారులు రెండు రోజుల నుంచి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఉండబండ నుంచి విడపనకల్లు మండల సరిహద్దు వరకూ రోడ్డుపై రెండో కోటింగ్ తారు రోడ్డు వేశారు. పగిలిన ప్రతీ చోట వేసిన రోడ్డును తొలగించి కొత్త రోడ్డును వేశారు. రెండోసారి రోడ్డు వేయటంతో ఆయా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బొగ్గుల ఫ్యాక్టరీని బంద్ చేయాలి



విచారణ చేస్తున్న ఏఈ

విడపనకల్లు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాళాపురం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన కట్టెలతో బొగ్గులు తయారు చేసే ఫ్యాక్టరిని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనంతపురం ఏఈ క్రిష్ణారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. పొల్యూషన్ అధికారి అడిగిన వాటి ఏ ఒక్క అనుమతి పత్రాన్నీ ఫ్యాక్టరీ నిర్వాహకులు చూపించలేదు. దీంతో ఫ్యాక్టరీని రెండు రోజుల్లో బంద్ చేయాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని ఏఈ హెచ్చరించారు.

ఉంతకల్లులో విషజ్వరాలు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు గ్రామంలోని ఆర్డీటీ కాలనీలో అనేక మంది చిన్నారులు విషజ్వరాల బారిన పడ్డారు. స్థానికంగా సరైన వైద్యం అందుకపోవడంతో సరిహద్దులోని బళ్లారిలో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. అయితే పేదకుటుంబాల వారు వైద్యం కోసం నిరీక్షిస్తున్నారు. ఆర్డీటీ కాలనీలో అనేక మంది జ్వరాలతో బాధపడుతున్నారని, వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని వైద్యులను కోరినా వారు పట్టించుకోవడం లేదని సర్పంచ్ ముక్కన్న వాపోయాడు. అధికారులు స్పందించి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు



వినాయక నిమజ్జనంలో పాల్గొన్న యువత

ఘనంగా వినాయక నిమజ్జనం

కణేకల్లు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉరవకొండ రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని మంగళవారం నిమజ్జనం చేశారు. కమిటీ ఆధ్వర్యంలో స్వామివారిని ఊరేగించి హెచ్చెల్సీలో నిమజ్జనం చేశారు.

మార్కెట్ యార్డుపై వైసీపీ దాడి తగదు



మాట్లాడుతున్న మార్కెట్ యార్డు కమిటీ సభ్యులు

గుంతకల్లు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనుమతులూ లేకుండా మార్కెట్ యార్డులోకి వచ్చిన వైసీపీ నాయకులు ఆందోళన చేయడమే కాకుండా దాడి చేస్తామని హెచ్చరించడం ఏమిటని యార్డు కమిటీ డైరెక్టర్లు, టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం సాయంత్రం స్థానిక మార్కెట్ యార్డులో వారు మాట్లాడారు. కొత్తగా నిర్మించిన రైతు బజార్ సముదాయానికి కమిటీ తీర్మానం లేకుండానే వైఎస్‌ఆర్ పేరు పెట్టారని, దీంతో కమిటీ తీర్మానంతో ఆ పేరును తొలగించామని అన్నారు. ఈ కారణంగా వైసీపీ నాయకులు మార్కెట్ యార్డులోకి వచ్చి ఆందోళన చేశారని, వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో యార్డు కమిటీ వైస్ చైర్మన్ రాణా ప్రతాప్, డైరెక్టర్లు ప్రసాద్, శ్రీదేవి, వీరాంజనేయులు, టీడీపీ నాయకుడు మత్రు నాయక్, జనసేన నాయకుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

పెన్నహోబిలం ఈఓగా జిల్లా దేవదాయశాఖ అధికారి

ఉరవకొండ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా జిల్లా దేవాదాయ శాఖ అధికారిగా తిరుమలరెడ్డి నియమితులయ్యారు. ఆలయ ఈఓగా ఉన్న రమేష్‌బాబు దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో ఆయన స్థానంలో జిల్లా అధికారిని నియమించారు. బుధవారం జరగాల్సిన హుండీ లెక్కింపు కూడా వాయిదా పడింది. ఆలయంలో సిబ్బంది లేకపోవడంతో జిల్లా అధికారి ఏ మేరకు నెట్టుకొస్తారో వేచి చూడాల్సి ఉంది.




తాడిపత్రిలో పాల్గొన్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్, జనసేన ఇన్‌చార్జిలు, కళ్యాణదుర్గంలో కేక్ పంచుతున్న ఎమ్మెల్యే అమిలినేని

ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదినం

తాడిపత్రి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ సినీనటుడు పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో రక్తదాన శిబిరాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి హాజరయ్యారు. కేక్‌కట్ చేసి... అందరికి స్వీట్లు పంచారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శిబిరంలో దాదాపు 150 మంది రక్తం దానం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, అయూబ్, కొండా శివ, రసూల్, మణికంఠ, నరసింహాచారి, సునీల్, దూద్‌వలి, బయపురెడ్డి పాల్గొన్నారు.

● కళ్యాణదుర్గం : స్థానిక ప్రజావేదిక వద్ద ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కేక్ కట్ చేశారు. అదేవిధంగా నందమూరి హరికృష్ణ 69వ జయంతి వేడుకలను కూడా ఘనంగా జరుపుకున్నారు.

● గుంతకల్లుటౌన్ : పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను స్థానిక హౌసింగ్ బోర్డుకాలనీలో మానసిక వికలాంగుల, బధిరుల ప్రత్యేక పాఠశాలలో నిర్వహించారు. ఇందులో టీడీపీ ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వాసిగిరి మణికంఠ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కురుబ పురుషోత్తం, సింగిల్ విండో చైర్మన్ తలారి మస్తానప్ప హాజరయ్యారు. పిల్లలకు ప్లేటు, గ్లాస్, పలక, పుస్తకాలను అందజేశారు.

● గుత్తి : స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కొత్తూరు కాలనీలోని ఆనాథ శరణాలయంలో అన్నదానం చేశారు. ఇందులో నియోజకవర్గ ఇన్‌చారి వాసగిరి మణికంఠ, మండల అధ్యక్షుడు చిన్న వెంకటేశులు, పట్టణ అధ్యక్షుడు పాటిల్ సురేష్, ప్రధాన కార్యదర్శి బోయగడ్డ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

● పుట్లూరు : జనసేన మండల కన్వీనర్ రవిసుధాకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సాకే మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల కన్వీనర్‌లు, గూడూరు మాజీ సర్పంచు నాగరాజు పాల్గొన్నారు.

● పామిడి : పట్టణంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఎన్డీయే కూటమి నాయకులు బొల్లు శ్రీనివాసరెడ్డి, గౌస్‌పీరా, అంజినాయక్, లాయర్ సతీష్, రాము, లాలు, షేక్షా పాల్గొన్నారు.

● బెళుగుప్ప : మండల కేంద్రంలో జనసేన మండల అధ్యక్షుడు కే సుధీర్, నాయకులు శెట్టి, శేఖర్, మహేష్, అభి, భువన్‌తేజ, గణేష్, టీడీపీ నాయకులు ఈరన్న, నారాయణ స్వామి కేక్ కట్ చేశారు.

● బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేస్వామికి జనసేన మండల కన్వీనర్ శివరాజ్, నాయకులు గొల్ల హనుమంతరెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.




గుంతకల్లులో కేక్ కట్ చేస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి, కురువ పురుషోత్తం, పుట్లూరులో కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

వైఎస్ఆర్ వర్ధంతి



యల్లనూరులో నివాళులర్పిస్తున్న భోగాతి నారాయణరెడ్డి

యల్లనూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, వైసీపీ నాయకులు భోగాతి నారాయణరెడ్డి కార్యకర్తలతో కలిసి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శంకర్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, వనం రవికుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్ : వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా వైసీపీ నాయకులు పాతబస్టాండ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, వైస్‌చైర్‌పర్సన్ నైరుతి రెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వర్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

● ఉరవకొండ:ఉరవకొండ వైసీపీలో వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి వర్గీయులు వైఎస్సార్ వర్ధంతిని వేర్వేరుగా నిర్వహించారు.

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం

ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బాల లోకేశ్ యాదవ్



మంత్రి నారా లోకేశ్‌తో బాల లోకేశ్ యాదవ్

కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు సముచిత స్థానం ఉంటుందని ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బాల లోకేశ్ యాదవ్ అన్నారు. మంగళవారం కడప జిల్లా కమలాపురం నియోజకవర్గ పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. తన కష్టాన్ని గుర్తించి ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అడుగు జాడల్లో నడుస్తూ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారం నిరంతరం కృషి చేస్తానన్నారు.

ఆటో బోల్తా.. యువరైతు మృతి



అనిల్ (ఫైల్)

కూడేరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దలాపురం గ్రామ సమీపంలో డ్రిప్ కట్టలతో వెళ్తున్న ఆటో బోల్తాపడటంతో.. మండలంలోని మరుట్ల 1వ కాలనీకి చెందిన రైతు అనిల్ (35) అక్కడికక్కడే మరణించాడు. అనిల్ బ్యాడిగ మిరప సాగు చేస్తున్నాడు. డ్రిప్ పైప్‌లను మంగళవారం సాయంత్రం అనంతపురంలో కొనుగోలు చేసి.. ఆటోలో వేసుకొని స్వగ్రామానికి బయలుదేరాడు. ముద్దలాపురం గ్రామం దాటిన తర్వాత ఆటో అదుపుతప్పి బోల్తాపడటంతో అనిల్ అక్కడికక్కడే మరణించాడు. తీవ్రంగా గాయపడ్డ ఆటో డ్రైవర్ ఏకాంత్‌ను స్థానికులు 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు అనిల్ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. అనిల్‌కు భార్య ప్రియాంక, ఇద్దరు పిల్లలున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాచుపల్లి గ్రామాశివారులోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుత్తికి చెందిన శేషు గాయపడ్డాడు. అతను బైక్‌పై గుత్తికి వస్తుండగా బాటసుంకులమ్మ దేవాలయం వద్ద బైక్ అదుపు తపి బోల్తా పడడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మద్యం సేవించి విధులకు..

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రేడియోలజీ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న మదన్ మంగళవారం మద్యం సేవించి.. విధులకు హాజరయ్యాడు. దీనిపై తోటి ఉద్యోగులు ఫిర్యాదు చేయడంతో సూపరింటిండెంట్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆసుపత్రికి చేరుకున్నారు. మత్తులో ఉన్న మదన్‌ను నిలదీశారు. గతంలో మదన్‌కు మూడు సార్లు మెమోలు ఇచ్చామని.. 15 రోజులు పాటు జీతం కోత విధించామని, అయినా అతనిలో మార్పు రాలేదని మండిపడ్డారు. అతనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.